www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 5-5-2024 | పేజీలు: 10 + 8 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 125 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి సా. 5.42 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 7.57 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ. 6.51-8.18; దుర్ముహూర్తం: సా. 4.51-5.42; అమృతఘడియలు: మ. 3.35-5.02; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.32 | శ్రీకాకుళం

Srikakulam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేటి మ్యాచ్‌లు

పంజాబ్ x చెన్నై	మ.3.30 గం. నుంచి
లఖ్‌నవూ x కోల్‌కతా	రాత్రి 7.30 గం. నుంచి

ఐపీఎల్ నుంచి మయాంక్ అవుట్



న్యూఢిల్లీ: లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ యువ పేసర్ మయాంక్ యాదవ్ ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. పొత్తి కడుపు గాయంతో అతను లీగ్‌కు దూరమయ్యాడని లఖ్‌నవూ ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ శనివారం వెల్లడించాడు. ఈసారి ఐపీఎల్‌లో 4 మ్యాచ్‌లు ఆడిన మయాంక్ 7 వికెట్లు పడగొట్టాడు. అయితే రెండు మ్యాచుల్లో అతడు తన కోటా ఓవర్లను పూర్తి చేయలేకపోయాడు. గుజరాత్‌తో మ్యాచ్‌లో ఒక ఓవర్ వేశాక పక్కటెముకల గాయంతో తప్పుకొన్నాడు. నాలుగు వారాల పునరావాసం తర్వాత మళ్లీ జట్టులోకొచ్చాడు. అయితే, ముంబైతో మ్యాచ్‌లో తిరిగి గాయపడ్డాడు.

ఆసీస్ పర్యటనకు ఎంపిక..?

అత్యంత వేగవంతమైన బౌలింగ్‌తో సంచలనం సృష్టిస్తున్న మయాంక్ యాదవ్‌పై బీసీసీఐ దృష్టిసారించింది. 21 ఏళ్ల ఈ బౌలర్‌ను బీసీసీఐ ఇప్పటికే తన పేసర్ల కాంట్రాక్టు జాబితాలో చేర్చింది. అయితే తరచూ గాయాల బారిన పడుతున్న అతడిని ఎన్‌సీఏ లో చేర్పించి ప్రత్యేకంగా పునరావాస చర్యలు చేపట్టాలని భావిస్తోంది. గాయాల నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధిస్తే జూన్-జూలైలో ఆస్ట్రేలియాలో పర్యటించే ఇండియా 'ఎ' జట్టుకు ఎంపిక చేయాలనుకుంటోంది. తద్వారా నవంబరులో ఆసీస్‌లో పర్యటించే భారత జట్టులోనూ అతడిని చేర్చాలని భావిస్తోంది.

డుప్లెసి ధమాకా

బెంగళూరు హ్యాట్రిక్ ● గుజరాత్ చిత్తు


డుప్లెసి (64)

బెంగళూరు: ప్లేఆఫ్స్ ఆశలు అడుగంటిన వేళ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు చెలరేగుతోంది. బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో గుజరాత్ టైటాన్స్‌ను స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన వేళ.. కెప్టెన్ డుప్లెసి (23 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 64) ధనాధన్ ఆటతో మెరిసింది. అయితే ఓ దశలో పేసర్ లిటిల్ (4/45) ధాటికి తడబడినట్టు కనిపించినా.. మరో 38 బంతులుండగానే ఆర్‌సీబీ మ్యాచ్‌ను ముగించింది. తద్వారా 4 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించడంతో పాటు 8 పాయింట్లతో ఏడో స్థానానికి ఎగబాకింది. టైటాన్స్‌కిది వరుసగా మూడో ఓటమి. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 19.3 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. షారుక్ (37), తెవాటియా (35), మిల్లర్ (30) రాణించారు. యష్, సిరాజ్, వైశాక్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో బెంగళూరు 13.4 ఓవర్లలో 6 వికెట్లకు 152 పరుగులు చేసి గెలిచింది. విరాట్ (42), దినేశ్ కార్తీక్ (21 నాటౌట్), స్వప్నిల్ (15 నాటౌట్) ఆకట్టుకున్నారు. నూర్ అహ్మద్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సిరాజ్ నిలిచాడు.

డుప్లెసి బాదుడు: 148 పరుగుల స్వల్ప ఛేదనలో ఆర్‌సీబీ పరుగుల వరద పారించింది. కెప్టెన్ డుప్లెసి బాదుడుకు పవర్‌ప్లేలోనే జట్టు 92 పరుగులతో వహ్వా అనిపించింది. కానీ ఆ తర్వాతే పేసర్ లిటిల్ ధాటికి టపటపా వికెట్లు కోల్పోవడంతో కాస్త టెన్షన్ నెలకొంది. కానీ దినేశ్ కార్తీక్ అండగా నిలిచి మ్యాచ్‌ను ముగించాడు. తొలి ఓవర్‌లో కోహ్లీ రెండు సిక్సర్లతో ఆకట్టుకోగా, ఆ తర్వాత ఆటంతా డుప్లెసీదే అయ్యింది. రెండో ఓవర్‌లో 4,4,6,4తో 20 రన్స్. నాలుగో ఓవర్‌లోనూ నాలుగు ఫోర్లతో 18 రన్స్ అందించాడు. అటు ఈ దూకుడుకు 18 బాల్స్‌లోనే ఫిఫ్టీని కూడా పూర్తి చేసుకున్నాడు. ఇక ఐదో ఓవర్‌లో కోహ్లీ రెండు సిక్సర్లతో 14 రన్స్ అందించాడు. పేసర్ జోషువా లిటిల్ ఓవర్‌లోనూ డుప్లెసి 4,6,4తో చెలరేగినా నాలుగో బంతికి క్యాచ్ అవుటయ్యాడు. దీంతో ఆర్‌సీబీ పరుగుల తుఫాన్‌కు తెర పడగా, తొలి వికెట్‌కు 35 బంతుల్లో 92 పరుగుల భాగస్వామ్యం కూడా ముగిసింది. ఈ దశలో ఆర్‌సీబీ అనూహ్యంగా తడబడి 25 రన్స్ వ్యవధిలోనే 6 వికెట్లు కోల్పోయింది. విల్ జాక్స్ (1), విరాట్‌ను స్పిన్నర్ నూర్ అవుట్ చేయగా.. రజత్ (2), మ్యాక్స్‌వెల్ (4), గ్రీన్ (1)లను లిటిల్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో ఆర్‌సీబీ 117/6తో నిలిచింది. అయితే అప్పటికే ఛేదనలో బంతులు ఎక్కువ, పరుగులు తక్కువగా ఉండడంతో ఇబ్బందిలేకపోయింది. రషీద్ ఓవర్‌లో దినేశ్ కార్తీక్ మూడు ఫోర్లతో 16 రన్స్ సాధించడంతో ఆర్‌సీబీ గెలుపు ఖాయమైంది.

పేసర్ల హవా: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ బ్యాటర్లు ఒక్కో పరుగు తీసేందుకు చెమటోడ్చారు. అటు ఈ సీజన్‌లో తొలిసారి ఆర్‌సీబీ బౌలర్లు అద్భుత రీతిలో చెలరేగారు. పేసర్లు సిరాజ్, యష్, గ్రీన్ చక్కటి లెంగ్త్‌తో బంతులు వేయడంతో టైటాన్స్ ఉక్కిరిబిక్కిరైంది. తన వరుస ఓవర్లలో సాహా (1), గిల్ (2) వికెట్లతో సిరాజ్ గట్టి షాకే ఇచ్చాడు. ఆరో ఓవర్‌లో సాయిసుదర్శన్ (6)ను షార్ట్ పిచ్ బాల్‌తో గ్రీన్ అవుట్ చేయగా పవర్‌ప్లేలో గుజరాత్ కేవలం 23/3 స్కోరుతో దీన స్థితిలో నిలిచింది. ఈ సీజన్‌లో ఏ జట్టుకైనా ఇదే అత్యల్ప స్కోరు. ఈ స్థితిలో షారుక్, మిల్లర్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరూ ఓవర్‌కో బౌండరీ ఉండేలా ఆడుతూ స్కోరును చక్కదిద్దారు. పదో ఓవర్‌లో మిల్లర్ 6, షారుక్ 4తో 12 రన్స్ వచ్చాయి. అయితే ఈ జోడీ ప్రమాదకరంగా మారుతున్న దశలో 12వ ఓవర్‌లో మిల్లర్‌ను కర్ణ్ శర్మ అవుట్ చేశాడు. అప్పటికి నాలుగో వికెట్‌కు 58 పరుగులు జత చేరాయి. ఇక తర్వాతి ఓవర్‌లోనే చక్కగా కుదురుకున్న షారుక్ రనౌట్ కావడం దెబ్బతీసింది. విరాట్ నేరుగా విసిరిన మెరుపు త్రోతో తను పెవిలియన్‌కు చేరాడు. ఈ తరుణంలో తెవాటియా హిట్టింగ్‌కు దిగి 16వ ఓవర్‌లో వరుసగా 4,6,4,4తో 19 రన్స్ అందించాడు. అటు రషీద్ (18) కూడా వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలతో చెలరేగాడు. వీరి ఆటతో 150 దాటేస్తుందనిపించినా.. 18వ ఓవర్‌లో యష్ ఈ ఇద్దరినీ వెనక్కి పంపి ఆర్‌సీబీకి ఊరటనిచ్చాడు. 19వ ఓవర్‌లో విజయ్ శంకర్ (10) రెండు ఫోర్లతో ఊపు మీద కనిపించాడు. కానీ ఆఖరి ఓవర్ తొలి మూడు బంతుల్లోనే టైటాన్స్ చివరి మూడు వికెట్లు కోల్పోయింది. మానవ్ (1), విజయ్ వికెట్లను వైశాఖ్ తీయగా.. మోహిత్ రనౌటయ్యాడు.

స్కోరుబోర్డు

గుజరాత్: సాహా (సి) దినేశ్ (బి) సిరాజ్ 1, గిల్ (సి) వైశాఖ్ (బి) సిరాజ్ 2, సాయి సుదర్శన్ (సి) కోహ్లీ (బి) గ్రీన్ 6, షారుక్ ఖాన్ (రనౌట్) 37, మిల్లర్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) కర్ణ్ శర్మ 30, తెవాటియా (సి) వైశాఖ్ (బి) యశ్ దయాల్ 35, రషీద్ ఖాన్ (బి) యశ్ దయాల్ 18, విజయ్ శంకర్ (సి) సిరాజ్ (బి) వైశాఖ్ 10, మానవ్ సూథర్ (సి) స్వప్నిల్ (బి) వైశాఖ్ 1, మోహిత్ శర్మ (రనౌట్) 0, నూర్ అహ్మద్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 19.3 ఓవర్లలో 147 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-1, 2-10, 3-19, 4-80, 5-87, 6-131, 7-136, 8-147, 9-147, 10-147; **బౌలింగ్:** స్వప్నిల్ 1-0-1-0, సిరాజ్ 4-0-29-2, యశ్ దయాల్ 4-0-21-2, గ్రీన్ 4-0-28-1, వైశాఖ్ 3.3-0-23-2, కర్ణ్ శర్మ 3-0-42-1.

బెంగళూరు: కోహ్లీ (సి) సాహా (బి) నూర్ 42, డుప్లెసి (సి) షారుక్ (బి) లిటిల్ 64, విల్ జాక్స్ (సి) షారుక్ (బి) నూర్ 1, పటీదార్ (సి) మిల్లర్ (బి) లిటిల్ 2, మ్యాక్స్‌వెల్ (సి) మిల్లర్ (బి) లిటిల్ 4, గ్రీన్ (సి) షారుక్ (బి) లిటిల్ 1, దినేశ్ (నాటౌట్) 21, స్వప్నిల్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 13.4 ఓవర్లలో 152/6; వికెట్ల పతనం:** 1-92, 2-99, 3103, 4-107, 5-111, 6-117; **బౌలింగ్:** మోహిత్ 2-0-32-0, జోష్ లిటిల్ 4-0-45-4, మానవ్ 2-0-26-0, నూర్ అహ్మద్ 4-0-23-2, రషీద్ 1.4-0-25-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	10	8	2	0	16	0.622
కోల్‌కతా	10	7	3	0	14	1.098
లఖ్‌నవూ	10	6	4	0	12	0.094
హైదరాబాద్	10	6	4	0	12	0.072
చెన్నై	10	5	5	0	10	0.627
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
బెంగళూరు	11	4	7	0	8	-0.049
పంజాబ్	10	4	6	0	8	-0.062
గుజరాత్	11	4	7	0	8	-1.320
ముంబై	11	3	8	0	6	-0.356

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

క్రికెట్‌లో నాకు నాన్నలా..

ధోనీపై సీఎస్‌కే పేసర్ పతిరన



చెన్నై: తన క్రికెట్ కెరీర్‌లో ఎంఎస్ ధోనీ తండ్రిలాంటి వారని శ్రీలంక యువ పేసర్ మతీష పతిరన అన్నాడు. మహీ ఇచ్చే చిన్నచిన్న సూచనలు తనకు ఎంతో ఆత్మవిశ్వాసాన్నిస్తాయని చెప్పాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున పతిరన ఆకట్టుకొనే ప్రదర్శన చేస్తున్నాడు. 'నా తండ్రి తర్వాత.. నా క్రికెట్ జీవితంలో ఆ పాత్రను పోషిస్తున్న వ్యక్తి ధోనీ. ఎల్లవేళలా నా గురించి జాగ్రత్తలు తీసుకొంటాడు. ఇంటి వద్ద నాన్న ఎలా సలహాలిస్తారో.. ఇక్కడ ధోనీ అలా..! మైదానంలో ఆడుతున్నప్పుడు పెద్దగా ఒత్తిడి చేయడు. అవసరమైన విషయాలు మాత్రమే సూటిగా చెబుతాడు. అవి నాలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయ'ని చెన్నై ఫ్రాంచైజీ యూట్యూబ్ చానెల్ షోలో పతిరన చెప్పాడు. ఏదైనా అనుమానం ఉన్నా, స్వేచ్ఛగా వెళ్లి అతడితో మాట్లాడతానన్నాడు. ధోనీ వచ్చే సీజన్‌లో కూడా తమతో కలసి ఆడాలని కోరుకుంటున్నట్టు 21 ఏళ్ల పతిరన తెలిపాడు.

స్టేడియాలు 'చిన్న'బోతున్నాయి



న్యూఢిల్లీ: తాజా ఐపీఎల్‌లో బ్యాటర్ల హవాతో అతి భారీ స్కోర్లు నమోదవుతున్నాయి. 250కి పైగా పరుగులను కూడా అలవోకగా బాదేస్తున్నారు. ఇలాంటి భారీ హిట్టింగ్‌పై వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆందోళన వ్యక్తం చేశాడు. భారీ హిట్టింగ్‌ల ఈ కారణంగా స్టేడియాల పరిమాణానికి ప్రాముఖ్యం లేకుండా పోయిందని అన్నాడు. 'గతంలో నిర్మించిన స్టేడియాలు ప్రస్తుత ఆటతీరుకు ఏమాత్రం సరిపోవడం లేదనిపిస్తోంది. ఇంపాక్ట్ ప్లేయర్‌తో గేమ్స్ అన్నీ ఏకపక్షంగా మారుతున్నాయి. దీంతో బౌలర్లు మానసికంగా దృఢంగా ఉండాల్సిందే. ఆట సమతూకంతో ఉంటేనే బాగుంటుంది. అయితే నైపుణ్యం కలిగిన బౌలర్ సవాల్‌ను స్వీకరించేందుకు సిద్ధంగానే ఉంటాడు' అని అశ్విన్ తెలిపాడు.

జట్టు ఎంపికలో 'ఏఐ'

ఇంగ్లండ్ మహిళల క్రికెట్‌లో నూతన సాంకేతికత

లండన్: ఎల్లలు లేని విధంగా కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరిగిపోతోంది. ఆటల్లోనూ ఏఐ కీలకపాత్ర పోషించే స్థితికి వచ్చింది. జట్టు ఎంపికలో ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకొంటున్నట్టు ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టు చీఫ్ కోచ్ జాన్ లూయిస్ తెలిపాడు. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లో 2-1తో ఇంగ్లండ్ జట్టు విజయంలో ఈ నవీన సాంకేతికత ఎంతో ఉపయోగపడిందని అతను చెప్పాడు. ఒకే తరహా నైపుణ్యాలతో ఇద్దరు ప్లేయర్లు ఉండి.. వారిలో ఒకరిని మాత్రమే ఎంపిక చేయాలనుకొన్న సమయంలో ఏఐ ఎంతో సాయం చేసిందని లూయిస్ తెలిపాడు. 'మనదగ్గర ఉన్న ఆటగాళ్లతో లైనప్ పంపితే.. పలు రకాలుగా పరీక్షించి ప్రత్యర్థి బలాలకు తగిన విధంగా ఉత్తమ జట్టును ఏఐ సూచిస్తుంద'ని లూయిస్ వెల్లడించాడు.

ఐఎస్ఎల్ విజేత ముంబై సిటీ



కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) టైటిల్‌ను ముంబై సిటీ ఎఫ్‌సీ రెండోసారి సొంతం చేసుకొంది. శనివారం జరిగిన ఫైనల్లో ముంబై 3-1తో మోహన్‌బగాన్ సూపర్ జెయింట్స్‌ను ఓడించింది. ఫస్టాఫ్ ఆఖర్లో జేసన్ కమిన్స్ (44వ నిమిషం) గోల్‌తో మోహన్‌బగాన్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కానీ, సెకండాఫ్ ఆరంభమైన 8వ నిమిషంలోనే ముంబై ఆటగాడు జార్జ్ పెరీరా డియాజ్ (53వ) గోల్‌తో స్కోరు 1-1తో సమమైంది. 81వ నిమిషంలో బిపిన్ సింగ్ గోల్‌తో ముంబై 2-1తో పైచేయి సాధించింది. ఆ తర్వాత ఇంజ్యూరీ టైమ్‌లో జాకబ్ వోజ్టస్ (90+7) మూడో గోల్ అందించాడు.

43 పతకాలతో భారత్ రికార్డు

ఆసియా యూత్ బాక్సింగ్

అస్తానా (కజకిస్థాన్): ఆసియా అండర్-22, యూత్ చాంపియన్‌షిప్‌లో శనివారంనాటి పోటీల్లో మరో నలుగురు బాక్సర్లు తమ విభాగాల్లో ఫైనల్స్‌కు చేరడంతో..ఈసారి టోర్నీలో భారత్‌కు రికార్డు స్థాయిలో మొత్తం 43 పతకాలు ఖాయమయ్యాయి. ఆకాశ్ (60 కిలోలు), విశ్వంత్ (48 కి.), నిఖిల్ (57 కి.), ప్రీత్ (67 కి.) ఫైనల్స్ చేరారు. యూత్ మహిళల విభాగంలో నిషా (52 కి.), నికితా (60 కి.)తో పాటు మరో ఐదుగురు ఫైనల్లో అడుగుపెట్టారు. మరో ఐదుగురు మహిళా బాక్సర్లు కాంస్య పతకాలు సాధించారు.

బిజినెస్

కోటక్ బ్యాంక్ లాభం రూ.4,133 కోట్లు

ఒక్కో షేరుకు రూ.2 డివిడెండ్



న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి (క్యూ4) కోటక్ మహీంద్రా బ్యాంక్ నికర లాభం స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన 18 శాతం వృద్ధితో రూ.4,133 కోట్లకు చేరుకుంది. మొత్తం ఆదాయం రూ.15,285 కోట్లకు పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి బ్యాంక్ లాభం 26 శాతం వృద్ధితో రూ.13,782 కోట్లకు, మొత్తం ఆదాయం రూ.56,072 కోట్లకు చేరుకుంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- క్యూ4లో కోటక్ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 13 శాతం పెరిగి రూ.6,909 కోట్లకు చేరుకోగా.. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఎన్ఐఐ 21 శాతం వృద్ధితో రూ.25,993 కోట్లుగా నమోదైంది. కాగా, నికర వడ్డీ మార్జిన్ 5.28 శాతంగా నమోదైంది.
- మార్చి 31 నాటికి బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 1.39 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.34 శాతానికి తగ్గాయి.
- మార్చి చివరి నాటికి బ్యాంక్ రుణాలు వార్షిక ప్రాతిపదికన 20 శాతం వృద్ధితో రూ.3.9 లక్షల కోట్లకు చేరుకోగా.. డిపాజిట్లు 23 శాతం పెరిగి రూ.4.45 లక్షల కోట్లకు ఎగబాకాయి.
- గత ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ వాటాదారులకు రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.2 డివిడెండ్‌ను ప్రకటించింది.

ఆర్‌బీఐ ఆంక్షలతో ప్రభావం చాలా తక్కువే: వాస్వానీ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తమ వ్యాపారంపై విధించిన ఆంక్షల ఆర్థిక ప్రభావం చాలా తక్కువే అయినప్పటికీ, బ్యాంక్ పేరు ప్రతిష్ఠలకు నష్టం చేకూరుతుందని ఆందోళన చెందుతున్నట్లు కోటక్ బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ వాస్వానీ అన్నారు. ఆర్‌బీఐ ఆంక్షలు మరికొన్ని నెలల పాటు కొనసాగవచ్చని ఆయన ఈ సందర్భంగా సంకేతాలిచ్చారు. కోటక్ మహీంద్రా ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ చానెళ్ల ద్వారా కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా, కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయకుండా గత నెలలో ఆర్‌బీఐ నిషేధం విధించింది. బ్యాంక్ ఐటీ రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలో లోపాలను గుర్తించిన నేపథ్యంలో ఆర్‌బీఐ బ్యాంక్‌పై క్రమశిక్షణ చర్యలు చేపట్టింది.

ఐడీబీఐ బ్యాంక్ లాభంలో 44% వృద్ధి

IDBI BANK

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఐడీబీఐ బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 44 శాతం పెరిగి రూ.1,628 కోట్లకు చేరుకుంది. మొత్తం ఆదాయం రూ.7,887 కోట్లకు పెరిగింది. గత ఏడాదిలో ఇదే కాలానికి బ్యాంక్ రూ.1,133 కోట్ల లాభం, రూ.7,014 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) మొత్తానికి బ్యాంక్ నికర లాభం 55 శాతం వృద్ధితో ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ.5,634 కోట్లకు, ఆదాయం రూ.30,037 కోట్లకు పెరిగింది. ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 12 శాతం పెరిగి రూ.3,688 కోట్లుగా నమోదైంది. మార్చి 31 నాటికి బ్యాంక్ నికర నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 0.34 శాతానికి తగ్గాయి. గత ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంక్ బోర్డు వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.15 డివిడెండ్ చెల్లించాలని ప్రతిపాదించింది.

22% పెరిగిన డీ-మార్ట్ లాభం

న్యూఢిల్లీ: డీ-మార్ట్ పేరుతో గొలుసుకట్టు సూపర్ మార్కెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్ లిమిటెడ్.. మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.563 కోట్ల లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ఆర్జించిన రూ.460 కోట్ల లాభంతో పోలిస్తే 22.39 శాతం అధికమిది. కాగా, ఈ జనవరి-మార్చి కాలానికి సంస్థ ఏకీకృత ఆదాయం రూ.12,727 కోట్లకు పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.50,789 కోట్ల ఏకీకృత ఆదాయంపై రూ.2,536 కోట్ల లాభాన్ని గడించింది. ఏడాది కాలంలో సంస్థ మరో 41 కేంద్రాలను ప్రారంభించింది. దాంతో మొత్తం సూపర్ మార్కెట్ల సంఖ్య 365కు చేరుకుంది. దేశంలోని 23 నగరాలకు విస్తరించినట్లు కంపెనీ వెల్లడించింది.

కేకేఆర్ చేతికి హెల్తియమ్ మెడ్‌టెక్!



డీల్ విలువ రూ.7,000 కోట్లు!!

ముంబై: ప్రపంచంలో నాలుగో అతిపెద్ద సర్జికల్ సూచర్ (శస్త్రచికిత్స కుట్టు) తయారీదారు హెల్తియమ్ మెడ్‌టెక్ (గతంలో సూచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్)ను అమెరికన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ కేకేఆర్ టేకోవర్ చేయబోతోంది. బ్రిటన్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ అపాక్స్ పార్ట్‌నర్స్ నుంచి 84 కోట్ల డాలర్ల (రూ.7,000 కోట్లు)కు హెల్తియమ్‌ను దక్కించుకున్నట్లు సమాచారం. ఈ సంస్థ కొనుగోలుకు కేకేఆర్‌తో పాటు దేశీయ ఫార్మా కంపెనీ మ్యాన్‌కైండ్ ఫార్మా, క్రిస్‌క్యాపిటల్ కన్సార్టియం, డెన్మార్క్‌కు చెందిన ఔషధ సంస్థ నోవో నార్డిస్క్ ప్రమోటర్ నోవో హోల్డింగ్స్ పోటీ పడ్డాయి. అయితే, నోవో హోల్డింగ్స్ చివరి నిమిషంలో పోటీ నుంచి తప్పుకున్నట్లు తెలిసింది. బిడ్డింగ్‌లో మ్యాన్‌కైండ్ ఫార్మా కన్సార్టియం 78 కోట్ల డాలర్లు (రూ.6,500 కోట్లు) ఆఫర్ చేయగా.. కేకేఆర్ రూ.7,000 కోట్ల బిడ్‌తో విజేతగా నిలిచినట్లు తెలిసింది. కాగా 2022లోనూ హెల్తియమ్‌కు చెందిన యూకే అనుబంధ విభాగాన్ని కేకేఆర్ కొనుగోలు చేసింది.

బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు

బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న హెల్తియమ్ మెడ్‌టెక్ కొనుగోలుకు సంబంధించి అపాక్స్ పార్ట్‌నర్‌తో కేకేఆర్ విధిగా కట్టుబడి ఉండే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ డీల్‌ను సోమవారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రస్తుతం హెల్తియమ్ మెడ్‌టెక్‌లో అపాక్స్ పార్ట్‌నర్ 99.8% వాటా కలిగి ఉండగా..మిగతా 0.2% వాటాను హెల్తియమ్ సీఈఓ, ఎండీ అనీశ్ బాఫ్నా చేతిలో ఉంది. సంస్థ కేకేఆర్ చేతుల్లోకి వెళ్లిన తర్వాత హెల్తియమ్‌కు బాఫ్నాయే సారథ్యం వహించనున్నట్లు తెలిసింది. 2018లో అపాక్స్ పార్ట్‌నర్స్.. హెల్తియమ్‌ను టీపీజీ గ్రోత్, సీఎక్స్ పార్ట్‌నర్స్ నుంచి దాదాపు 30 కోట్ల డాలర్లకు (రూ.1,950 కోట్లు) కొనుగోలు చేసింది. స్మిత్ అండ్ నెఫ్యూ, జాన్సన్ అండ్ జాన్సన్ మాజీ ఎగ్జిక్యూటివ్‌లైన ఎల్‌జీ చంద్రశేఖర్, ఎస్ సుబ్రమణియమ్ 1992లో సూచర్స్ ఇండియాను ప్రారంభించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో హెల్తియమ్ రూ.820 కోట్ల ఆదాయంపై రూ.256 కోట్ల నిర్వహణ లాభాన్ని ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఆదాయం రూ.1,000 కోట్లు, నిర్వహణ లాభం రూ.350 కోట్ల స్థాయికి చేరుకోవచ్చని అంచనా.

జెన్ టెక్నాలజీస్ డివిడెండ్ 100 శాతం

క్యూ 4 లాభం రూ.33 కోట్లు

Zen Technologies Limited

హైదరాబాద్: జెన్ టెక్నాలజీస్.. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను కంపెనీ స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.138.04 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.33.03 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.74.33 కోట్ల ఆదాయంపై రూ.17.21 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.444.20 కోట్ల ఆదాయంపై రూ.129.23 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.1 ముఖ విలువ ప్రతి షేరుకు రూ.1 డివిడెండ్ (100 శాతం)ను బోర్డు సిఫారసు చేసింది. కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత 30 రోజుల్లో ఈ డివిడెండ్‌ను చెల్లించనున్నట్లు తెలిపింది. కాగా మార్చి ముగిసే నాటికి చేతిలో రూ.1,401.97 కోట్ల ఆర్డర్లు ఉన్నట్లు జెన్ టెక్నాలజీస్ వెల్లడించింది.

ఐటీసీ ద్వారా చెల్లింపులు ఆలస్యమైనా వడ్డీ కట్టాలా..?

ఇదీ GST


రాంబాబు గొండాల

జీఎస్‌టీలో నమోదై రిటర్నులు దాఖలు చేస్తూ పన్ను చెల్లించే వారిలో చాలా మందికి ఉండే ఆలోచన ఏమిటంటే పన్ను చెల్లింపు ఆలస్యమైనప్పటికీ.. ఆ మొత్తాన్ని నగదు ద్వారా కాకుండా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ద్వారా చెల్లిస్తే ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదని అనుకుంటారు. కానీ, ఇది కొంత వరకే నిజం. ఈ అవగాహనా లోపం వల్ల చాలామంది పొరపాట్లు చేస్తున్నారు. ఇలాంటి వారికి వడ్డీ చెల్లించమని నోటీసులు వస్తున్నాయి. అసలు ఈ విషయాన్ని ఎలా అర్థం చేసుకోవాలో చూద్దాం.

ఇంతకు ముందు ఉన్న విధానంతో పోలిస్తే జీఎస్‌టీలో రిటర్న్ దాఖలు చేసే పద్ధతి కొంచెం భిన్నంగా ఉంటుంది. అంటే నెలకు చెల్లించాల్సిన మొత్తం చెల్లిస్తేగానీ రిటర్న్ దాఖలు కాదు. ఉదాహరణకు ఒక వ్యక్తి ఒక నెలలో రూ.50,000 పన్ను చెల్లించాల్సి ఉండగా, రూ.40,000 ఐటీసీ ఉందనుకుందాం. అంటే మిగతా రూ.10,000 నగదు ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. కానీ, సమయానికి రూ.10,000 అందక రిటర్న్ వాయిదా పడింది. ఒక నాలుగు నెలల తర్వాత తనకు నగదు సర్దుబాటు అయిన అనంతరం మొత్తం రూ.50,000తో రిటర్న్ దాఖలు చేశాడు. సకాలంలో రిటర్న్ దాఖలు చేయనందుకు తాను లేట్ ఫీజు కూడా చెల్లించాడు. అయితే ప్రభుత్వానికి సకాలంలో పన్ను చెల్లించలేదు కాబట్టి పన్ను చెల్లించాల్సిన తేదీ నుంచి చెల్లింపు జరిగిన తేదీ వరకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. మరి ఈ వడ్డీ ఎంత మీద చెల్లించాలనే దానిపై మొదట్లో కొంత గందరగోళం ఉండేది. చెల్లించాల్సిన మొత్తం రూ.50,000 కాబట్టి ఆ మొత్తం మీద వడ్డీ చెల్లించాలని ఒక వాదన. కాగా రూ.40,000 సదరు వ్యక్తికి ఐటీసీ రూపంలో నిర్ణీత గడువు నాటికే అందుబాటులో ఉంది కాబట్టి నగదు రూపంలో చెల్లించిన రూ.10,000 మీద మాత్రమే వడ్డీ వర్తిస్తుందని మరొక వాదన.

మొత్తానికి దీనికి సంబంధించి ప్రభుత్వం కొంత వివరణ ఇవ్వటం జరిగింది. అంతేకాకుండా సంబంధిత సెక్షన్‌లో సవరణ కూడా చేయటం జరిగింది. దీని ప్రకారం రిటర్న్ ఆలస్యంగా దాఖలు చేసిన సందర్భంలో ఐటీసీ ద్వారా చెల్లించిన పన్ను మేరకు ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదు. అంటే నగదు ద్వారా చెల్లించిన పన్నుకు మాత్రమే వడ్డీ వర్తిస్తుంది. పై ఉదాహరణలో రూ.40,000 ఐటీసీ ద్వారా చెల్లించటం జరిగింది కాబట్టి దాని మీద వడ్డీ చెల్లించనవసరం లేదు. కేవలం రూ.10,000 మీద మాత్రమే చెల్లించాలి.

కానీ, ఇక్కడ కొన్ని షరతులు ఉన్నాయి. రిటర్న్ దాఖలు చేయటం లేట్ అయినప్పటికీ ఆ రిటర్న్ పీరియడ్‌కు సంబంధించిన వివరాలు అన్నీ ఆ రిటర్న్‌లో కచ్చితంగా చూపాలి. ఉదాహరణకు ఒక వ్యాపారస్తుడు జనవరి నెలలో రూ.లక్ష అమ్మకాలు చేపట్టాడు. దానికి గాను రూ.12,000 పన్ను చెల్లించాలనుకుందాం. ఈ రూ.12,000 గాను తన దగ్గర రూ.14,000 ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఉంది. పన్ను చెల్లింపు మొత్తానికి ఐటీసీ సరిపోతుంది కాబట్టి నగదులో ఎలాంటి చెల్లింపులు చేయనవసరం లేదు. అయితే జనవరి నెల రిటర్న్ ఏదో కారణంతో సకాలంలో చేయకుండా ఒక రెండు నెలల తర్వాత చేశాడనుకుందాం. అయినప్పటికీ, ఆ రిటర్న్‌లో జనవరిలో జరిపిన రూ.లక్ష అమ్మకాలు మొత్తం చూపి, దానికి సంబంధించిన పన్నును నగదు ఉపయోగించకుండా ఐటీసీ ద్వారా చెల్లిస్తే ఎలాంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అలాకాకుండా, అదే జనవరి రిటర్న్ సకాలంలో వేసి రూ.లక్షకు గాను రూ.60,000 అమ్మకాలు మాత్రమే చూపి మిగతా రూ.40,000 అమ్మకాలు ఫిబ్రవరి నెల రిటర్న్‌లో కలిపి చూపితే ఐటీసీ సరిపోను ఉన్నప్పటికీ రూ.40,000కు వడ్డీ మినహాయింపు రాదు. అంటే పన్ను చెల్లింపు ఆలస్యమైనప్పటికీ సంబంధిత రిటర్న్ ఏ పీరియడ్‌కైతే దాఖలు చేస్తున్నారో, ఆ పీరియడ్‌లో జరిపిన సరఫరాల వివరాలు అన్నీ చూపి తగిన పన్ను చెల్లించాలి. అలా చెల్లించినప్పుడు మాత్రమే ఐటీసీ ద్వారా జరిపిన చెల్లింపునకు వడ్డీ మినహాయింపు లభిస్తుంది. ఇంకొక షరతు ఏమిటంటే, రిటర్న్ దాఖలు చేయటమనేది అధికారులు చర్యలు తీసుకోవటానికి పూర్వమే జరిగి ఉండాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,830 ▲	65,850 ▲	86,500 ▼
ముంబై	71,191 ▼	65,211 ▼	79,989 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	465	విజయవాడ	460
వరంగల్	467	గోదావరి	460
చిత్తూరు	543	విశాఖపట్నం	470
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	131	విజయవాడ	139
వరంగల్	131	గుంటూరు	139
కరీంనగర్	131	ఒంగోలు	139
మహబూబ్‌నగర్	131	చిత్తూరు	137
కర్నూలు	131	నెల్లూరు	137
విశాఖపట్నం	131	అనంతపురం	139
గోదావరి	139		

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 5-5-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పార్టీ మారారని వైసీపీ నేతల అకృత్యం

● తోటలో జీడి, మునగ చెట్లు నరికివేత



జీడితోటను పరిశీలిస్తున్న గౌతు శివాజీ

హరిపురం, మే 4: 'గ్రామానికి కనీసం రోడ్డు వేసుకోలేక పోయాం. ఇంకా ఆ పార్టీలో కొనసాగితే ఏం లాభం' అనుకుని మందస మండలం కేసుపురంలో వైసీపీకి చెందిన కొందరు యువకులు గత నెలలో గౌతు శిరీష ఆధ్వర్యాన టీడీపీలో చేరారు. చేరిన వారిలో బొడ్డు మోహన్‌కు చెందిన జీడి తోటలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు జీడి, మునగచెట్లను నరికివేశారు. పార్టీ మారినందుకు కొంతమంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు కొద్దిరోజులుగా బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నరికివేతకు గురైన తోటను టీడీపీ నేత, మాజీ మంత్రి గౌతు శివాజీ, పలువురు టీడీపీ నాయకులు శనివారం పరిశీలించారు. వైసీపీ నాయకులు సైకోల్లా మారారని, చెట్లను నరికివేయటం ఘోరమైన తప్పిదమమని ఆయన అన్నారు. ఈ దుశ్చర్యపై మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్టీ మారితే ఇలాంటి దౌర్జన్యాలకు దిగడం భావ్యం కాదని, ఇలాంటి చర్యలు పునరావృతమైతే ప్రతిఘటనలు ఎదురవుతాయని టీడీపీ నాయకులు హెచ్చరించారు.

ఇది అధికార దోపిడీ

ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న వేళ కొందరు అధికారపార్టీ నేతల దోపిడీకి అడ్డే లేకుండా పోయింది. యంత్రాంగం విధుల్లో నిమగ్నమై ఉండగా.. విపక్షాల నాయకులు ప్రచారంలో బిజీగా ఉండగా.. వీరు మాత్రం తమపని కానిచేస్తున్నారు. వంశధార, నాగావళి నదలను కొల్లగొడుతున్నారు. యంత్రాలతో ఇసుకను తవ్వి లారీల్లో విశాఖకు తరలిస్తున్నారు. బిల్లుపై ఉన్న ధరకన్నా అధికంగా అమ్ముకుని జేబులు నింపుకొంటున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలనూ బేఖాతరు చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

- వంశధార, నాగావళిలో అడ్డుగోలుగా తవ్వకాలు
- సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నా పట్టని వైనం
- యంత్రాలతో తవ్వి.. టిప్పర్లతో తరలించి..
- జిల్లా నుంచి విశాఖపట్నానికి సరఫరా
- దండుకుంటున్న అధికారపార్టీ నాయకులు
- నిలువరించలేకపోతున్న అధికారులు

ఇసుకాసురులు సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. నదుల్లో ఇసుక తవ్వకాలకు సంబంధించి యంత్రాలు ఉపయోగించరాదని, ఇసుక రవాణా చేయకూడదని సుప్రీంకోర్టు ఇటీవల ప్రత్యేక ఆదేశాలను జారీ చేసింది. అయినప్పటికీ తాము తగ్గేది లేదంటూ ఇసుక తవ్వకాలకు అనుమతి పొందిన ఏజెన్సీ నిర్వాహకులు.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఇసుక రీచ్‌ల నిర్వహణ.. తవ్వకాలకు 'ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్' సంస్థకు అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ సంస్థ ఇచ్చిన రశీదులతో నాగావళి, వంశధార నదుల నుంచి విశాఖకు దర్జాగా ఇసుక తరలిపోతుంది. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ.. అధికారపార్టీ నేతల అండతో అక్రమ రవాణా సాగిపోతోంది. ఏజెన్సీలకు అధికార పార్టీ నేతలకు ఇసుక కల్పతరువుగా మారిపోయింది.

● అనుమతి ఒకచోట.. తవ్వకాలు మరోచోట....

కొత్తూరు మండలం నవగాం వద్ద వంశధార నదిలో ఇసుక తవ్వకాలకు.. తరలింపునకు ఏజెన్సీకి అనుమతి లభించింది. ప్రస్తుతం కొత్తూరు మండలం అంగూరులో వంశధార నదిలో ఇష్టానుసారంగా ఎక్స్‌కవేటర్లతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఆ ఇసుకను తారాస్ లారీలతో విశాఖకు తరలించేస్తున్నారు. కాగా.. బిల్లులో మాత్రం నవగాం నుంచి తరలిస్తున్నట్టు చూపుతున్నారు. అలాగే బిల్లుపై ఉన్న ధర కన్నా.. అదనంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై అధికారులు కనీసం పట్టించు కోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎచ్చెర్ల మండలం పొన్నాడ వద్ద నాగావళి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు



అంగూరులో తవ్వకాలు చేపడుతున్నా.. నవగాం నుంచి తరలిస్తున్నట్లు ఇచ్చిన రశీదు



కొత్తూరు మండలం అంగూరులో ఎక్స్‌కవేటర్లతో ఇసుక తవ్వకాలు



వంశధార నదిలో క్యూ కట్టిన ఇసుక లారీలు...

● వంశధార, నాగావళిని తోడేస్తున్నారు...

నరసన్నపేట మండలం మడపాం వద్ద వంశధార నదిలో కూడా ఎక్స్‌కవేటర్లతో ఇసుక తవ్వేస్తున్నారు. హైవేకు ఆనుకుని ఉన్న ఈ నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా.. అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.

● ఎచ్చెర్ల మండలం పొన్నాడ వద్ద నాగావళి నదిలోనూ యంత్రాలతో ఇసుకను అక్రమంగా తవ్వుతూ నేరుగా విశాఖకు తరలిస్తున్నారు. శ్రీకాకుళం రూరల్, గార, ఆమదాలవలస మండలాల్లో కూడా వంశధార, నాగావళి నదుల్లో ఇసుకను తోడేస్తున్నారు. ఎక్కడా ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయలేదు.

● జలుమూరు మండలం డొంపాక వద్ద వంశధార నదిలో ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. వందలాది లారీలు, ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు. కొత్త, పాత తేదీలతో రశీదులు ఇచ్చి.. దోపిడీకి పాల్పడుతున్నారు. ఎన్నికల వేళ అటు అధికారులు విధుల్లో బిజీగా ఉన్నారు. ఇటు ప్రతిపక్ష నాయకులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఇదే అదునుగా అధికారపార్టీ నాయకుల అనుచరులు ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి సారించి.. సుప్రీంకోర్టు ఆదేశాలు అమలయ్యేలా నదుల్లో ఇసుక తవ్వకాలు నిలుపుదలకు చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

వైసీపీ పాలనపై అంతటా అసంతృప్తే

- టీడీపీతోనే రాష్ట్రానికి పూర్వవైభవం
- సినీ హీరో నారా రోహిత్



నర్సింగపురంలో ఎన్నికల ప్రచారంలో నారా రోహిత్, గౌతు శిరీష

పలాస/ హరిపురం, మే 4 : 'వైసీపీ పాలనపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. రాష్ట్రాన్ని సీఎం జగన్మోహన్‌రెడ్డి నాశనం చేశారు. టీడీపీతోనే రాష్ట్రానికి పూర్వవైభవం సాధ్యమ'ని సినీహీరో, టీడీపీ నాయకుడు నారా రోహిత్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన పలాస నియోజకవర్గంలో పర్యటించారు. మందస మండలం నర్సింగపురంలో పలాస టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. టీడీపీ నాయకులతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. అలాగే పలాస టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ తీరును విమర్శించారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీని సాగనంపి.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. 'వైసీపీ పాలనలో యువత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉద్యోగావకాశాలు లేవు. కొత్త పరిశ్రమలు రాకపోగా.. ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయి. ఉపాధి కోసం చాలా మంది యువత హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై తదితర రాష్ట్రాలకు వలస పోవాల్సిన దుస్థితి నెలకొంది' అని రోహిత్ ఆరోపించారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబుకు మళ్లీ అధికారం అప్పగిస్తే.. సంక్షేమ పాలన, రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. యువతకు మేలు జరుగుతుందన్నారు. యువత భవిష్యత్ కోసం చంద్రబాబును సీఎంను చేయాలని కోరారు. టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష మాట్లాడుతూ.. ప్రతి చేతికీ పని.. ప్రతి చేనుకూ నీరు అనే నినాదంతో ముందుకెళ్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ దీవించి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, జీకే నాయుడు, వి.మాధవరావు, కర్రయ్య, రట్టి లింగరాజు, రుద్రయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

7న రాజ్‌నాథ్ సింగ్ రాక

రణస్థలం, మే 4: బీజేపీ అగ్రనేత రాజ్‌నాథ్‌సింగ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 7న జిల్లాకు రానున్నారు. ఎచ్చెర్ల బీజేపీ(కూటమి) అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావుకు మద్దతుగా నిర్వహించనున్న సభలో పాల్గొనున్నారు. ఎచ్చెర్ల సాయుధ పోలీస్ మైదానంలో హెలీప్యాడ్ వద్దకు ఆ రోజు మధ్యాహ్నం 12.10 గంటలకు చేరుకుంటారు. 12.20 గంటల నుంచి 1.10 గంటల వరకు సభలో ప్రసంగిస్తారు. 1:20 గంటలకు ఇక్కడ నుంచి విశాఖపట్నం బయలుదేరతారు. పర్యటన విజయవంతం చేసేలా పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

మోసం గురూ!

మేమేం చేశాం పాపం..



మూలపేట పోర్టుకు శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్ (ఫైల్)

- మూలపేట నిర్వాసితుల్లో కొందరికి అందని పీడీఎఫ్, యూత్ ప్యాకేజీలు
- నెరవేరని సీఎం జగన్ హామీ


● సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రామానికి చెందిన దారపు తాతారెడ్డి అనే దివ్యాంగుడు ఉపాధి కోసం కొన్నాళ్ల పాటు వలస వెళ్లాడు. మూలపేటలో ఆ దివ్యాంగుడికి ఇల్లు, ఆస్తులు ఉన్నా పీడీఎఫ్ మాత్రం అందలేదు. పీడీఎఫ్ కోసం అధికారుల చుట్టూ తిరిగి తిరిగి చివరికి నెలరోజులు కిందట ఆ దివ్యాంగుడు మృతి చెందాడు.

● మూలపేట పంచాయతీ విష్ణుచక్రం గ్రామానికి చెందిన గిన్ని రామారావు అనే వ్యక్తి వలస వెళ్లడంతో పీడీఎఫ్ ఇప్పటికీ అందలేదు.

● మూలపేట గ్రామానికి చెందిన జీరు హైమ భర్త ఎర్రయ్య కుటుంబం ఉపాధి కోసం కొన్నాళ్ల పాటు విశాఖపట్నం వలస వెళ్లింది. ఆ కుటుంబానికి పీడీఎఫ్, కుమారులకు యూత్‌ప్యాకేజీ సైతం అందలేదు.

(టెక్కలి)

..ఇలా మూలపేట పోర్టుకు సంబంధించి 16 నిర్వాసిత కుటుంబాలకు పీడీఎఫ్ అందలేదు. మరో 16 మందికి యూత్‌ప్యాకేజీ దక్కలేదు. గతేడాది ఏప్రిల్ 19న సీఎం జగన్ మూలపేట పోర్టుకు శంకుస్థాపన చేశారు. నిర్వాసితులందరికీ పీడీఎఫ్, యూత్‌ప్యాకేజీలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకూ చాలామందికి పీడీఎఫ్, యూత్‌ప్యాకేజీ అందలేదు. సీఎం హామీ ఇచ్చినా తమకు ఎటువంటి పరిహారం దక్కడం లేదని ఆయా నిర్వాసితులంతా ఆవేదన చెందుతున్నారు. కొన్నాళ్ల కిందట పోర్టు అభివృద్ధి పనుల పరిశీలన పేరిట వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మత్స్యశాఖమంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర పెద్దలు వచ్చారు. ఆ సమయంలో నిర్వాసితులు తమ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి అర్జీలు అందజేసినా ఇంతవరకూ పరిష్కారం చూపలే దు. సబ్‌కలెక్టరేట్‌తో పాటు అధికారపార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నా తమను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



శ్రీకాకుళంలో పోస్టల్ బ్యాలెట్‌కు బారులుదీరిన ఉద్యోగులు, ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

గందరగోళంగా.. పోస్టల్ బ్యాలెట్



- నరసన్నపేటలో ఆలస్యంగా ప్రారంభం
- కేంద్రాల్లో నేతల హల్‌చల్

నరసన్నపేట/కలెక్టరేట్, మే 4: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. కొన్నిచోట్ల గందరగోళ పరిస్థితులు తలెత్తగా.. మరికొన్నిచోట్ల ప్రశాంతంగా సాగింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లోనూ పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల విధుల ఉద్యోగులు తమకు కేటాయించిన కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోలింగ్ ప్రక్రియను కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పరిశీలించారు. పాతపట్నంలో పోలింగ్ కేంద్రాన్ని కూడా సందర్శించారు. పకడ్బందీగా బ్యాలెట్ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. కాగా.. నరసన్నపేటలో పోస్టల్‌బ్యాలెట్ పోలింగ్ నిర్వహించే సిబ్బంది మధ్య సమన్వయలోపం.. కేంద్రాల వద్ద అధికారుల పర్యవేక్షణ లోపంతో గందరగోళ పరిస్థితులకు కారణమైంది. నరసన్నపేటలోని జూనియర్ కళాశాలలో.. ఉదయం 7గంటల నుంచే పోస్టల్‌బ్యాలెట్ ప్రారంభమవుతుందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. కానీ 9 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించారు. దీంతో ఉద్యోగులు నిరీక్షించి.. అసహనం వ్యక్తం చేశారు. నరసన్నపేట మండలానికి కేటాయించిన పోలింగ్ కేంద్రంలోకి ఉద్యోగులతో పాటు.. వివిధ రాజకీయ పార్టీ నాయకులు వెళ్లారు. సిబ్బందికి అవగాహన లేక అందరినీ ఒకేసారి పోలింగ్ కేంద్రంలోకి పంపించడంతో ఉద్యోగులు ఓటు వేసేందుకు నానా ఇబ్బంది పడ్డారు. రహస్యంగా కాకుండా బహిరంగంగా ఓటు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఉద్యోగులు గగ్గోలు చెందారు. దీనిపై పోలింగ్ సిబ్బందిని నిలదీశారు. అక్కడ విధులు నిర్వహించే పీవో కూడా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆర్వో జీవీ రామ్మోహన్‌రావు అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఓటు వేసిన కవర్లను వేసేందుకు ఏర్పాటు చేసిన డ్రమ్ములపై పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు చెందినట్లు చిన్న అక్షరాలతో రాశారు. దీంతో కొందరు ఉద్యోగులు గందరగోళానికి గురయ్యారు. పోలింగ్ కేంద్రాల వద్ద రాజకీయపార్టీ నాయకులు హల్‌చల్ చేశారు. ఉద్యోగులను ప్రభావితం చేసేందుకు కొందరు ప్రయత్నించారు. నరసన్నపేట సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐ ఆశోక్‌బాబు బందోబస్తు నిర్వ హించారు. ఉమ్మడిపార్టీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి, వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కాగా.. నరసన్నపేటలో పోలింగ్‌పై వచ్చిన కథనాలు వాస్తవం కాదని, సాఫీగా ఈ ప్రక్రియ జరిగిందని ఆర్వో రామ్మోహన్ తెలిపారు.



నరసన్నపేటలో ఎన్నికల సిబ్బందిని నిలదీస్తున్న ఉద్యోగులు

కానిస్టేబుల్ దురుసు

టెక్కలి, మే 4: టెక్కలిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్వహించిన పోస్టల్‌బ్యాలెట్ ప్రక్రియ వద్ద కానిస్టేబుల్ డి.గోపాలం దురుసుగా వ్యవహరించారు. ఓటింగ్ వద్ద ఫ్యాన్ లేక ఉక్కపోతకు గురైన కాంగ్రెస్ అభ్యర్థి కిల్లి కృపారాణి బయటకు వచ్చి కుర్చీపై కూర్చోగా.. ఆమెపై కానిస్టేబుల్ చిర్రుబుర్రులాడారు. ఇక్కడ కూర్చోవద్దు.. లోపలకు వెళ్లండి అంటూ గద్దించడంతో తానేమి చేశానని కానిస్టేబుల్‌ను ఆమె ప్రశ్నించారు. లోపలకు వెళ్తావా? లేదా? అంటూ దురుసుగా మాట్లాడారు. టీడీపీ అభ్యర్థి తరఫున జనరల్ ఏజెంట్‌గా వచ్చిన కింజరాపు ప్రసాద్‌తో పాటు వైసీపీ ఏజెంట్లపైనా కూడా కానిస్టేబుల్ ఇదే రీతిలో వ్యవహరించాడు. దీంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేస్తానని కృపారాణి తెలిపారు.


వైసీపీ నేతల అత్యుత్సాహం

● వాట్సాప్ స్టేటస్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

మెళియాపుట్టి/ కొత్తూరు, మే 4: పాతపట్నం ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ వద్ద వైసీపీ నేతలు అత్యుత్సాహం చూపారు. ఉద్యోగులు ఎవరికి ఓటు వేశారో తెలిపేలా.. నియోజకవర్గానికి చెందిన ఓ అధికార పార్టీ నాయకుడు తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టడం చర్చనీయాంశమైంది. ఓ ఉద్యోగి వైసీపీ అభ్యర్థి రెడ్డి శాంతికి ఓటు వేసి.. దాన్ని ఫొటో తీసి కొత్తూరు మండలానికి చెందిన వైసీపీ నాయకుడికి ఫోన్ ద్వారా పంపాడు. ఆ నాయకుడు దానిని తన వాట్సాప్‌లో స్టేటస్‌గా పెట్టి.. ఇతర ఉద్యోగులను కూడా ప్రభావితం చేసేలా ప్రచారం చేశాడు. ఈ వ్యవహారం కలకలం రేపుతోంది. పోలింగ్ వద్ద సెల్‌ఫోన్ వినియోగించరాదని నిబంధన ఉన్నా.. కొంతమంది బరితెగించి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జన కేతనం

ఎన్నికల కథ



అనగనగా..
ఓ గొడ్డలి పార్టీ

(నరసన్నపేట)

కొన్ని గుర్తులు, పేర్లు ఏవేవో కథలను గుర్తు చేస్తుంటాయి. అటువంటి కథే ఓ... అడవిలో జరిగింది. ఒక పెద్ద అడవిలో ఎన్నికలొచ్చాయట. అడవిలో ఉండే అన్ని చెట్లు, జంతువులకూ ఓటుహక్కు కల్పించారు. ఎన్నికల్లో అడవిలో ఉండే సేలయేరు, ఓ గొడ్డలి పోటీపడ్డాయి. చెట్లన్నీ జంతువులను కూడేసి అయ్యా.. ఈ గొడ్డలి మాకు నిత్య ప్రత్యర్థిగా ఉంటుంది, దీంతోనే మా జాతి ఎదుగుదల లేక మొత్తం నాశనమైపోతుంది, దీన్ని బలపరిస్తే ఇక అడవి రావణ కాష్టమవుతుందని ప్రచారం మొదలెట్టాయి. ఈ సేలయేరే మాకు ప్రాణాధారం. మీరంతా కూడా ఎన్నికల్లో సెలయేరుకు ఓటేసి గెలిపించాలని కోరాయి. జంతువులన్నీ కూడబలుక్కుని చెట్లు చెపుతున్నది నిజమే కదా... ఈ గొడ్డలితో చెట్లకే కాకుండా తమకు కూడా ముప్పుందని అంగీకరించాయి. అంతే కాకుండా సెలయేరు మనక్కూడా ప్రాణాధారమే కదా. అదిలేకపోతే మనం బతికేదెలానని సెలయేరుకే ఓటేసేందుకు జంతువులన్నీ ఏకగ్రీవంగా తీర్మానించాయి. ఎన్నికలు ముగిశాయి. గొడ్డలి చిత్తుచిత్తుగా ఓడిపోతుందని అన్ని సర్వేలు కూడా నిగ్గుతేల్చాయి. లెక్కింపు పూర్తయ్యింది. అనూహ్య రీతిలో గొడ్డలి భారీ మెజార్టీతో గెలిచింది. పాపం..! చెట్లు, జంతువులకూ ప్రాణాధారంగా ఉన్న సేలయేరు మోసపోయి ఓడిపోయింది. అంతా ఆశ్చర్యపోయారు. ఏం జరిగిందో అర్థం కాక జంతువుల నేతలు చెట్లనేతలను పిలిచి గొడ్డలి ఎలా గెలిచిందని నిలదీశాయి. అప్పుడు ఆ చెట్లు ఇలా చెప్పుకొచ్చాయి. నిజమే సేలయేరు వల్ల మీరు మేము బతుకుతున్నాం. గొడ్డలి మాకు బద్ధశ్రతువు. దాని వల్ల మా జాతి అంతరిస్తోంది. ఇదీ నిజమే.. అయితే గొడ్డలికి ఉన్న కర్ర మాత్రం మా కులంది. దాన్ని చూసి గెలిపించాల్సి వచ్చింది. బహుశా ఇది విన్న ఆ జంతువులన్నీ రాత్రికి రాత్రే వేరే అడవికి పారిపోయినట్లు ఉన్నాయి.



ఆయారాం.. గయారాంలు
ఎవరబ్బా..

(నరసన్నపేట)

ఎన్నికలు ముందు, తర్వాత ఆయారాం, గయారాం పదాలు ఎక్కువగా వినిపిస్తుంటాయి. ఎన్నికల తర్వాత ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాని సమయంలో వీరి పాత్ర కీలకంగా ఉంటుంది. అసలు ఆయారాం... గయారాం అంటే..

1967లో హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో పల్వాల్ జిల్లా హోదల్ అసెంబ్లీ స్థానం నుంచి గయాలాల్ ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. సీఎం ఎన్నిక కోసం గయాలాల్ ఓటు కీలకంగా మారింది. అయన ఒక్కరోజులోనే ఏకంగా మూడు పార్టీలు మారారు. చివరకు కాంగ్రెస్ గూట్లోకి వచ్చి పడ్డారు. ఆ పార్టీ నాయకులు, సీఎం రేసులో ఉన్న రావు బీరేంద్రసింగ్ ఇలా కాదని గయాలాల్ తమ వాడేనంటూ నేరుగా విలేకరుల ఎదుట హాజరుపరిచారు. గయా లాల్‌ను పరిచయం చేస్తూ అప్పుడు గయారాం.. ఇప్పుడు ఆయారాం అని కితాబిచ్చారు. ఇక అప్పట్నుంచీ పార్టీలు ఫిరాయించేవారిని ఆయారాం.. గయారాంలుగా పిలవడం మామూలైంది.

ఐదు దశాబ్దాల కిందట..

సాధారణ ఎన్నికలు, అసెంబ్లీ, పార్లమెంట్‌లో బలపరీక్షలు తదితర కీలక సమయాల్లో ఆయారాం, గయారాంలు చక్రం తిప్పుతుంటారు. ప్రజలు దృష్టింతా తమవైపు మళ్లించు కుంటారు. మన ప్రాంతాల్లో ఇటువంటివార్ని గోపీలంటాం (గోడ మీద పిల్లులు). ఐదు దశాబ్దాల కిందట వాడిన పదం నేటికీ రాజకీయాల్లో ఎక్కువగా వినిపిస్తోంది. అసలు ఈ ఆయారాం.. గయారాంలు ఇద్దరు కాదు. ఒక్కరే అంటే నమ్మశక్యం కాదు.

అయ్యో.. ధర్మాన

- ఎంతసేపూ జగన్ భజనేనా ● పాత పనులపైనే కథలు
- నియోజకవర్గానికి కొత్తగా తెచ్చిందేమీ లేదు
- విలువైన ప్రభుత్వ స్థలాల ఆక్రమణ ● అయినా మంత్రి మౌనమే
- గెలుపుపై సన్నగిల్లుతోన్న నమ్మకం



(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

తన గెలుపుపై మంత్రి ధర్మాన ప్రసాదరావు లెక్క తప్పుతోందా అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ఇటీవల ఆయన చేస్తోన్న ప్రసంగాలే దీనికి ఉదాహరణగా నిలుస్తోన్నాయి. విషయ పరిజ్ఞానమున్న నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. కానీ ప్రస్తుతం ధర్మాన చేస్తున్న ప్రసంగాలు పేలవంగా ఉంటున్నాయి. ఎంతసేపూ జగన్ భజన.. పరనింద అనేలా ప్రసంగాలు కొనసాగుతున్నాయి. ఈ ఐదేళ్లలో నియోజకవర్గానికి ఆయన చేసిందేమీ లేదు. కాంగ్రెస్ హయాంలో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులనే ఇప్పటికీ గొప్పలుగా చెప్పుకుంటున్నారు. దీంతో ప్రజలు విసుగు చెందుతున్నారు. అదేంటి ధర్మాన ఇలా మాట్లాడుతున్నారు.. అయ్యో అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. 2014లో వైసీపీ తరఫున పోటీచేసిన ఆయన టీడీపీ అభ్యర్థి గుండ లక్ష్మీదేవి చేతిలో భారీ ఓటమిని చవిచూశారు. 2019లో 'జగన్‌కు ఒక్క ఛాన్స్' కారణంగా స్వల్ప మెజార్టీతో ధర్మాన గెలిచారు. ఆ తర్వాత రెండున్నరేళ్లకు మంత్రి పదవిని సీఎం జగన్మోహన్‌రెడ్డి కట్టబెట్టారు. ఈవిషయం ప్రజలకు తెలిసిందే.

పాతవాటిపై కథలు..

ముఖ్యమంత్రిని మంత్రి పొగడటం సాధారణమే. అయితే నియోజకవర్గంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు ఏం చేశామన్నదీ అయనా చెప్పుకోవాలి. ప్రజలకు కూడా తెలియాలి. పలు దఫాల సమావేశాల్లో అమాంతం సీఎం జగన్‌పై పొగడ్తల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. ఇది ప్రజలకు తీవ్ర విసుగ్గా ఉంటోంది. గతంలో కాంగ్రెస్ పార్టీలో ధర్మాన మంత్రిగానూ ఉన్నారు. ఆ విషయం సైతం మరిచిపోతున్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన రిమ్స్ వైద్యకళాశాల, నగరంలో మిల్లు జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు వెళ్లే దారిలో ఎనభై అడుగుల రోడ్డు నిర్మాణం, వంశధార కుడి కాలువ తదితర పనులను ఇప్పుడు చెప్పుకుంటున్నారు. పాత కథలనే చెప్పుకోవడంపై ప్రజలు విస్మయం చెందుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయిపోయింది. ప్రజా తీర్పుకోసం ఎన్నికల్లో పోటీచేయాల్సిందే. ఈ ఐదేళ్ల కాలంలో తాను ఎమ్మెల్యేగా.. మంత్రిగా శ్రీకాకుళం నియోజకవర్గానికి ఏమి చేసిందన్నదీ చెప్పుకునేందుకు ఒక్కటీ కూడా లేదాయె. ఇదే విషయం ప్రజలు పదేపదే బయట చర్చించుకుంటున్నారు. తనకు ఈ దఫా ఎన్నికల్లో పోటీచేసేందుకు ఆసక్తి లేదని.. విశ్రాంతి తీసుకుంటామని చెప్పినా సరే జగన్ ఆదేశాలతో పోటీ చేస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ఆయన రాజకీయాలపైనా మక్కువ కోల్పోతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

ప్రభుత్వ స్థలాల కబ్జాపై మౌనం..

రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా రెండున్నరేళ్ల నుంచి ధర్మాన వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా.. అలాంటివి జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అధికారం ఆయన చేతిలోనే ఉంది. కానీ కొన్ని విషయాల్లో ఉదాసీనతే పాటించారని ప్రచారం జరుగుతోంది. శ్రీకాకుళం నగరంలో ఆదివారంపేట నుంచి ఆమదాలవలస వైపు వెళ్లే రోడ్డులో కొత్త రోడ్డు వరకు ఎడమవైపు నాగావళి నదీ గట్టుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అధికార పార్టీ నేతలు కబ్జా చేశారు. గతంలో ఇది ప్రభుత్వ స్థలమే. ఇప్పుడు జిరాయితీగా మారిపోయింది. అధికార పార్టీకి చెందిన ముగ్గురు ప్రముఖులు అధికారులతో కుమ్మక్కయి రికార్డులను మార్చేశారు. ఆ ప్రాంతం తమదే అన్నట్లుగా హద్దులు ఏర్పాటు చేశారు. ఈ స్థలం కోట్ల రూపాయల విలువ చేస్తుంది. దీనిపై మంత్రి కనీసం విచారణ చేపట్టలేదు. అలాగే, తండ్యాంవలస సమీపంలోని సావిత్రిపురం పేరుతో 67 ఎకరాల్లో లేఅవుట్ వేశారు అధికార పార్టీ నేతలు. ఇందులో ప్రభుత్వ భూమి 20 ఎకరాల వరకు ఉంది. వీరికి మంత్రి అండదండలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల జిల్లాకు వచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, మాజీమంత్రి నారా లోకేష్ కూడా నేరుగా మంత్రి ధర్మానపై ఇదే విషయమై ఆరోపణలు చేశారు. అయినా మంత్రి మౌనం వహించడంతో నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు.

సన్నగిల్లుతున్న నమ్మకం..

ఈ ఎన్నికల్లో మంత్రి ధర్మాన గెలుపుపై వైసీపీ శ్రేణుల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. 2019 ఎన్నికల్లోనే ఆయన అత్యల్ప మెజార్టీతో గెలిచారు. అది కూడా జనసేన, బీజేపీ ఓట్లు చీలిపోవడంతోనే. ఈ దఫా కూటమితో ఓట్లు చీలే అవకాశం లేదు. పైగా నియోజకవర్గంలో కొత్త కార్యక్రమాలేవీ మంత్రి ధర్మాన ఏమీ చేపట్టలేదు. ఎంతో ప్రధానమైన శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు పూర్తిచేయించడంలో విఫలమయ్యారు. ఇదే అత్యంత మైనస్. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం కూడా పూర్తికాలేదు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగావళి నదిలో నిర్మిస్తున్న డైక్‌ను కూడా మధ్యలోనే వదిలేశారు. కలెక్టరేట్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కేఆర్ స్టేడియం పనులు కూడా ఈ ఐదేళ్లలో పూర్తిచేయించలేకపోయారు. పాత పనులే తప్ప వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఆయన చేసిందేమీ లేదు. ప్రస్తుతం టీడీపీ శ్రీకాకుళం నియోజకవర్గంలో బలంగా ఉంది. అభ్యర్థి ఎవరన్నదీ కంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలన్న తపన పార్టీ శ్రేణులు, ప్రజల్లో ఉంది. ఈ ఎన్నికల్లో మంత్రి లెక్క కచ్చితంగా తప్పుతుందని, ఆ పార్టీకి చెందిన విశ్లేషకులే చెబుతున్నారు.

చక్కగా ఓటెయ్యొచ్చు..



- విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సదుపాయాలు
- పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, వీల్ చైర్లు
- ఇప్పటికే వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్‌కు అవకాశం
- జిల్లాలో 21,481 మంది ఓటర్లు

(నరసన్నపేట/కలెక్టరేట్)

సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు ఓటు వేయడానికి ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక సదు పాయాలు కల్పిస్తోంది. శతశాతం ఓటింగ్ నమోదుచేయాలన్న లక్ష్యంతో కలెక్టర్ మనజీర్ జిలానీ ప్రత్యేక దృష్టి సారించారు. దివ్యాంగులంతా తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాలను ఫ్రెండ్లీపోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దుతుంది. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు సులభంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేవిధంగా జిల్లా యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేస్తోంది. వారి పోలింగ్ కేంద్రానికి చేరుకుని.. ఓటు వేసి తిరిగి ఇంటికి వెళ్లే వరకు అధికారులు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 21,481 మంది దివ్యాంగ ఓటర్లు నమోదయ్యారు. వీరంతా ప్రస్తుత ఎన్నికల్లో తప్పక ఓటేసేలా ఎన్నికల అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

ప్రత్యేక సదుపాయాలు..

● పోలింగ్ బూత్ వరకు దివ్యాంగులను తీసు కొచ్చి... వారు ఓటు వేసిన తర్వాత తిరిగి వాహనంలో ఇంటికి చేర్చుతారు. ● ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ట్రైసైకిల్ అందుబాటులో ఉంటుంది. మూగ, చెవిటి ఓటర్లకు సైన్ లాంగ్వేజీ ద్వారా ఓటు వేసే సదుపాయం కల్పిస్తారు. ● పోలింగ్ కేంద్రాల్లోకి సులువుగా రాకపోక లు జరిపేందుకు ర్యాంపు నిర్మించారు. ● అంధులకు సహాయంగా పోలింగ్ కేంద్రంలోకి ఒకరిని అనుమతిస్తారు.

మోడల్ పోలింగ్ స్టేషన్లు..

దివ్యాంగుల్లో ఓటువేసే విధానంపై మరింత అవగాహన కల్పించేందుకు వారిని పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు జిల్లాలో రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈమేరకు ఎచ్చెర్ల మండలంలో భగీరథపురం, పలాస నియోజవర్గంలో వజ్రపుకొత్తూరు మండలంలోని పల్లెసారధి పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. ఆయా కేంద్రాల పరిధిలో ఇక్కడ ఎక్కువ మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారు. ఇక్కడ ర్యాంపులు, తాగునీరు. వైద్యసదుపాయంతో పాటు ప్రత్యేక మరుగుదొడ్లను కూడా ఏర్పాటు చేశారు.

ప్రత్యేక సౌకర్యాలు పొందేవారు వీరే..

అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడి లోపం, చలన/శారీరక వైకల్యం, మానసిక వైకల్యం/బుద్ధిమాంద్యం, మానసిక రుగ్మత, యాసిడ్ దాడి బాధితులు, తలసేమియా, హిమోఫిల్ల (రక్తం గడ్డకట్టని స్థితి), మెదడు పక్షవాతం, ఆటిజం, బహుళ వైకల్యం, కుష్టువ్యాధి నయమైనవారు, మరుగుజ్జు, దీర్ఘకాలిక నరాల సమస్య, బలహీనత, కండరాల క్షీణత, నాడీ వ్యవస్థలో సమస్యలున్నవారు అర్హులు.

867 వీల్‌చైర్లు ఏర్పాటు..

దివ్యాంగ ఓటర్లు ఉన్న పోలింగ్‌కేంద్రాలకు వీల్ చైర్లను ఏర్పాటు చేయ నున్నారు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో 867 వీల్‌చైర్లు ఏర్పాటు చేశారు. నరసన్నపేట, ఎచ్చెర్ల, పలాస, పాతపట్నం, టెక్కలి, ఆమదాలవలస, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో దివ్యాంగుల్లో అంగవైకల్యం శాతం ఆధారంగా వీల్‌చైర్లను ఏర్పాటుచేశారు. వీరిని ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ ఎస్ వలంటీర్లు ద్వారా ఇంటి నుంచి పోలింగ్‌కేంద్రాలకు తీసుకువెళ్లి ఓటు వేసిన తర్వాత తిరిగి ఇంటికి చేర్చేలా సదుపాయం కల్పించారు.

జిల్లాలో దివ్యాంగ ఓటర్లు..

నియోజవర్గం	దివ్యాంగులు
ఇచ్ఛాపురం	2,775
పలాస	2,573
టెక్కలి	2,649
పాతపట్నం	2,380
శ్రీకాకుళం	2,724
ఆమదాలవలస	2,255
ఎచ్చెర్ల	3,144
నరసన్నపేట	2,981
మొత్తం	21,481

అన్ని ఏర్పాట్లు చేశాం..

దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్ కేంద్రాలకు అతి సమీపంలో వాహనాల పార్కింగ్, గ్రౌండ్ ఫ్లోర్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశాం. ప్రతీ కేంద్రం వద్ద ఎన్‌సీసీ/ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అందుబాటులో ఉంచాం. గత ఎన్నికల్లో 70 శాతం మంది దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసారి శత శాతం సాధించాలన్నదే మా లక్ష్యం.

-కె.కవిత, ఏడీ, విభిన్న ప్రతిభావంతుల శాఖ



సాక్షం యాప్..

దివ్యాంగుల సహాయం కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా సాక్షం యాప్ రూపొందించింది. ఓటరుగా నమోదు చేసుకోవడం, మార్పులు చేర్పులు, పోలింగ్‌కేంద్రాన్ని తెలుసుకోవడం, వీల్‌చైర్, రవాణా సదుపాయం కోసం అభ్యర్థన, అంధులకు వాయిస్ ద్వారా సహకరించడం, వినికిడి లోపం ఉన్నవారికి టెక్స్ట్ టు స్పీచ్‌థెరపీ తదితర రకాల సహాయ సహకారాలను ఆ యాప్ ద్వారా విభిన్న ప్రతిభావంతులు పొందవచ్చు.




హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్

అక్కడ టీడీపీదే ఆధిపత్యం

- ఇక్కడి నుంచే కింజరాపు కుటుంబం ప్రాతినిధ్యం
- 2009లో హరిశ్చంద్రపురం నియోజకవర్గం కనుమరుగు

(టెక్కలి)

హరిశ్చంద్రపురం.. ఇదేదో పట్టణ ప్రాంతం కాదు. కోటబొమ్మాళి మండలంలోని ఓ కుగ్రామం. ఈ గ్రామం ఐదు దశాబ్దాల కిందట ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. 1967లో డిలిమిటేషన్ కమిషన్ సిఫారసుల మేరకు అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడడంతో గ్రామం రూపురేఖలు మారిపోయాయి. ఇక్కడ తర్వాత కాలంలో రైల్వేహాల్టింగ్ సదుపాయం కూడా కల్పించారు. అయితే నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో 2009తో కనుమరుగై టెక్కలిలో కలిసిపోయింది. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ఈ నియోజకవర్గం ఎంతో గుర్తింపుపొందింది. ఈ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి కింజరాపు ఎర్రన్నాయుడు 1996, 1998 1999, 2004ల్లో లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రిగా కూడా పనిచేశారు. ఇక ఇక్కడి నుంచి టీడీపీ ఆరు, కాంగ్రెస్ పార్టీ, స్వతంత్రులు చెరో రెండుసార్లు చొప్పున ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఇక్కడ టీడీపీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గం రద్దయిన వరకూ ఆ పార్టీదే ఆధిపత్య. ఇక్కడి నుంచే కింజరాపు కుటుంబ సభ్యులు ప్రాతినిధ్యం వహించారు. మారుమూల ప్రాంతమైన హరిశ్చంద్రపురం నియోజకవర్గం దేశ రాజకీయాల్లో చక్రం తిప్పే స్థాయిలో ఎర్రన్నాయుడు ఎదగడం విశేషం. ఆ తర్వాత లోక్‌సభ సభ్యుడిగా ఇదే నియోజకవర్గానికి చెందిన రామ్మోహన్ నాయుడు ఎన్నికై పార్లమెంట్‌లో పలు సమస్యలపై అనర్గళంగా మాట్లాడడం ఓ ప్రత్యేకత సంతరించుకుంది. హరిశ్చంద్రపురం నుంచి 1967లో స్వతంత్ర అభ్యర్థిగా కింజరాపు కృష్ణమూర్తి, 1972-78ల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున కేఏఎన్ భుక్త, 1983-85లో టీడీపీ తరఫున కింజరాపు ఎర్రన్నాయుడు, 1989లో స్వతంత్ర అభ్యర్థిగా కింజ రాపు ఎర్రన్నాయుడు, 1994లో టీడీపీ తరఫున ఎర్రన్నాయుడు, 1996, 1999, 2004 టీడీపీ తరఫున కింజరాపు అచ్చెన్నాయుడు గెలుపొందారు. హరిశ్చంద్రపురం నియోజకవర్గం 1967 నుంచి 2009 వరకు 37ఏళ్ల పాటు సేవలందించింది.



ఎన్టీఆర్‌తో ఎర్రన్నాయుడు



అచ్చెన్నాయుడు

నాడు టికిలి.. నేడు టెక్కలి

- 1952లో నియోజకవర్గంగా ఏర్పాటు


చరిత్ర

(టెక్కలి)

ఒరియాలో టికిలి అంటే స్త్రీలు పెట్టుకునే కుంకుమ బొట్టు. ఒడిశాలోని గజపతి జిల్లా పర్లాకిమిడి రాజులు కుంకుమబొట్టు కింద టెక్కలి ఎస్టేట్‌ను మట్టమహిషికి టికిలీ కింద ధారాదత్తం చేశారు. కాలానుగుణంగా బ్రిటీష్ వారి కాలంలో టికిలి అనే పేరు టెక్కలిగా రూపాంతరం చెందింది. పాతటెక్కలి రాజధానిగా నందాపురం రాజ్యాన్ని శైలోద్భవరాజులు పరిపాలించారని ఉత్కళ చరిత్ర చెబుతోంది. నర్సింహకేడి అనే రాజు 1422లో టెక్కలి పట్టణాన్ని రూపకల్పనచేశారు. ఉత్కళాధిపతులకు సామంతులుగా కదంబగంగాలుగా పాలిం చారు. తర్వాత గంజాం, శ్రీకాకుళం, టెక్కలి ప్రాంతాలు విజయనగరం పరిధిలో ఉండేవి. ఈ ప్రాంతం 1797లో ఈస్టిండియా కంపెనీ ఆధీనంలోకి వచ్చింది. పర్లాకిమిడి రాజు గజపతి పద్మనాభదేవ్ 1816 నుంచి 1832 వరకు టెక్కలిని పాలించారు. పద్మనాభదేవ్, రామకృష్ణదేవ్ మరణాంతరం పురుషోత్తమ నారాయణదేవ్, పద్మనాభదేవ్ కుమారులు గోవిందనాద్‌దేవ్ కూడా కొన్నాళ్లు పాలించారు. పద్మనాభదేవ్ కుమారులు గోవింద్‌నాద్‌దేవ్, కృష్ణచంద్రదేవ్ టెక్కలి సంస్థానాన్ని రెండుగా విభజించి టెక్కలి ఎస్టేట్‌ను గోవింద్‌దేవ్‌కు, నందిగాం ఎస్టేట్‌ను క్రిష్ణచంద్రదేవ్‌కు పంచిపెట్టారు. కాగా రెవెన్యూ రికార్డుల పరిధిలో టెక్కలి రఘునాథపురంగా నమోదైంది. 1952 నుంచి టెక్కలిలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేయడంతో పాటు నియోజకవర్గ కేంద్రంగా గుర్తింపుపొందింది.



టెక్కలి ఏరియల్ వ్యూ



టెక్కలి: పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఉద్యోగులు



పలాస: ఓటింగ్ కోసం బారులు తీరిన ఉద్యోగ, ఉపాధ్యాయులు



రణస్థలం: ఎచ్చెర్లలో పోస్టల్ బ్యాలెట్‌లో ఓటేసేందుకు క్యూలో ఉన్న దృశ్యం



పాతపట్నం: అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

ఉద్యోగుల ఓటు పడింది

● ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ● భారీస్థాయిలో వినియోగించుకున్న ఎన్నికల సిబ్బంది ● పరిశీలించిన కలెక్టర్ మన్‌జీర్ జిలానీ

(పలాస,ఇచ్ఛాపురం, రణస్థలం, ఆమదాలవలస, పాతపట్నం, టెక్కలి, మే 4)

సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, ఉద్యోగులు శనివారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యూలో ఉండి ఓటు వేశారు. మూడు రోజుల పాటు జరిగే పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో భాగంగా తొలిరోజు శనివారం భారీస్థాయిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని ఓటు వేశారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో 711 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సంబంధించి స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో 642మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర తెలిపారు. ఇచ్ఛాపురం-132 మంది, కవిటి-138, కంచిలి-95, సోంపేట-277మంది ఉద్యోగులు ఓటు వేసినట్లు చెప్పారు. ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎచ్చెర్ల సాయుధ పోలీసు కార్టర్స్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహించారు. 630 మంది ఓట్లేశారు. ఆమదాలవలస నియోజకవర్గంలో పలువురు ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో 759 ఓట్లు పోలైనట్లు ఈఆర్వో ఎం.అప్పారావు తెలిపారు. పాతపట్నం ఏపీ మోడల్‌స్కూల్‌లో జరిగిన ఓటింగ్ ప్రక్రియను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పరిశీలించారు. టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 862 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. టెక్కలి డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో సంతబొమ్మాళి మండలం నుంచి 196 మంది, కోటబొమ్మాళి 208, నందిగాం 196, టెక్కలి మండలం నుంచి 262 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓటు వేశారు. అన్నిచోట్ల అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు.





పలాస: సిరా గుర్తు చూపిస్తున్న ఉపాధ్యాయ దంపతులు

ఇచ్ఛాపురం: ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగి



పాతపట్నం: పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటున్న ఉద్యోగులు

● ఓటుకు రూ.3 వేలు నుంచి రూ. 4వేలు ● వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయులు

ఉద్యోగులకు ప్రలోభాలు

(మెళియాపుట్టి)

జిల్లాలో వైసీపీ నాయకులు ఉద్యోగులను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ వేసే ప్రక్రియ శనివారం ప్రారంభమయ్యింది. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ ఎన్నికలు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య హోరా హోరీగా సాగుతోంది. ప్రతి ఓటు కీలకంగా మార డంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై గురిపెట్టాయి. ఎన్నికలకౌంటింగ్ సమయంలో ముందుగా ఈ ఓట్లను లెక్కిస్తారు. వీటిలో ఓటింగ్ ట్రెండ్ ఆధారంగా ఏ పార్టీ అధికా రంలోకి వస్తుందో ముందుగా కొంతమేర కొలిక్కివచ్చే అవకాశముంటుంది. ఎన్నికల్లో ఉద్యోగులు ఇచ్చే తీర్పు ఆధారంగా కొన్ని సార్లు ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ఈసారి ఉద్యోగ వర్గాలు వైసీపీపై తీవ్ర వ్యతిరేకతతో ఉండడంతో ఓటుకు రూ.ముడు నుంచి నాలుగు వేలు ఇచ్చైనా తమకు ఓటు వేసేలా ఆ పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

వీరికే పోస్టల్ బ్యాలెట్ వేసే సదుపాయం

సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు శనివారం నుంచి మూడురోజులపాటు ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. జిల్లాలో మొత్తం 25,505 మందిగా గుర్తించారు. వీరిలో ఎన్నికల విధుల్లో ఉన్న పీవో, ఏపీవో, ఓపీవోలుగా 15,627 మంది, ఇతర ఎన్నికల సిబ్బంది 4,134 మంది, మాజీ సైనికులు 1873 మంది ఇంటి వద్దే ఓటింగ్ వేసేవారు 455 మంది, ఇతర అధికారులు 3,256 మంది, ఏవీఈఎస్ ఓటర్లు 80 మందికి పోస్టల్ బ్యాలెట్ వేసే అవకాశం కల్పించారు.

ఓటు వేసే విధానంలో మార్పు

గతంలో పోస్టల్ బ్యాలెట్ కవర్‌లో పెట్టి పోస్టులో పంపించేవారు ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఈ ఓటింగ్ వేసే విధానంలో మార్పు తీసుకువచ్చింది. పోస్టల్ బ్యాలెట్ వేసేవారికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేసి తేదీలు కూడా ఖరారుచేసింది. ఈ మేరకు శనివారం నుంచి కేటాయించిన కేంద్రానికి వెళ్లి ఓటు వేసే సౌకర్యం కల్పించారు.

ఏజెంట్లు ఏర్పాటు చేసుకుని

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి పోస్టింగ్‌లు ఇవ్వడంతోపాటు ప్రస్తుతం కొంతడబ్బులు కూడా ఇస్తామని ఏజెంట్లుగా ఏర్పాటుచేసుకుని పోస్టల్ ఓటర్లను తమకు ఓటు వేసేలా వైసీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈమేరకు ఉద్యోగులు ఓట్లకు డబ్బులతో ఎరవేయడానికి వైసీపీ అభ్యర్థులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కొంత మంది తమకు అనుకులంగా ఉన్న ఉద్యోగులతోపాటు పదవీ వీరమణ చేసిన ఉద్యోగులను ఏజెంట్లుగా ఏర్పాటుచేసుకుని బేరసారాలు సాగిస్తున్నారు.ఓటుకు మూడు నుంచి నాలుగు వేలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముందుగానే ఆర్వో కార్యాలయం నుంచి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగుల వివరాలు తీసుకుని ఇళ్లకు వెళ్లి బేరసారాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత

వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ఐదేళ్ల ఇబ్బందిపడిన ఉద్యోగులు ఆగ్ర హంతో ఉన్నారు.ప్రధానంగా ఉపాధ్యాయులు వైసీపీకి అనుకులంగా లేకపోవడంతో మిగతా శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది.కొంతమందిఉద్యోగ సంఘం నాయకులను తమకు ఆనకూలంగా మార్చుకోవాలని వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగుల్లో వ్యతిరేకత కనిపిస్తుండడంతో వైసీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు.

ప్రచారానికి ఎండదెబ్బ

● జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగతలు నమోదు
● నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు
● సాయంత్రం ప్రచారాలు, రోడ్‌షోలకు ప్రాధాన్యత



(మెళియాపుట్టి)

ఇంట్లో ఏసీ.. బయటకు వెళితే కారులో ఏసీ.. ఇలా నిత్యం చల్లదనంలో ఉండే అభ్యర్థులు మండుటెండలో ఎన్నికల ప్రచారానికి వెళుతూ..చెమటలు కక్కుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందునుంచే జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. వడగాల్పులు తీవ్రంగా ఉన్నాయి. నోటిఫికేషన్ వెలువడిన దగ్గర నుంచి మరింత పెరిగాయి. ప్రచారంలో ముందుండాలనే ఉద్దేశంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో అభ్యర్థులు ఉదయం... సాయంత్రం ప్రచారం చేపట్టారు. రాను రాను సూర్యప్రతాపం ఎక్కువ కావడంతో కార్య కర్తలు ప్రచారానికి డుమ్మా కొడుతు న్నారు. కొందరు అభ్యర్థులు... కార్యకర్తలు కూడా వడదెబ్బకు గురవుతున్నారు. ఎక్కువ సంఖ్య లో కార్యకర్తల మధ్య ప్రచారంచేయడం... హారతులు.. పూలదండలు.. నుదుటి తిలకం.. ప్రచారంలో మంటలు పుటిస్తున్నాయి. కొంతమంది అభ్యర్థులు కార్యకర్తలు డీ-హైడ్రేషన్‌కు గురై.. సొమ్మసిల్లి పడిపోతున్న సందర్భాలు ఉంటున్నాయి. దీంతో చేసేది ఏమీ లేక.. కొందరు అభ్యర్థులు ఉదయం 9 గంటలకే ప్రచారం ముగించుకుని.. తిరిగి సాయంత్రం 5 గంటల తరు వాత ప్రచారం, రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. ఈ నెలలో ఉష్ణోగ్రతలు మరీ తీవ్రంగా ఉం టాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అయినా ఈ వారం రోజులు ఎలాగైనా వీలున్నంత వరకు ఎక్కువ మంది ఓటర్లను కలుసుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఈ కొద్ది రోజులైనా సూరీడు కాస్త శాంతిస్తే బాగుండునని కోరుకుంటున్నారు.

ఓటింగ్‌పై ప్రభావం

కొద్దిరోజులుగా ఉష్ణోగతలు పెరుగుతున్నాయి. పోటీచేసే అభ్యర్థులు ఉదయం తమ అను చరులతో వ్యూహాలు రూపొందించుకుని సాయంత్రం ప్రచారంలో పాల్గొంటున్నారు. సాయం త్రం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో రెండు వారాలు నుంచి 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగతలు నమోదవుతున్నాయి. ఇలాగే పోలింగ్ నాటికి ఎండల తీవ్రత ఉంటే ఓటింగ్ తగ్గే అవకాశముందని వివిధ పార్టీల నాయకులు చెబుతున్నారు. ఒకవేల ఓటింగ్ శాతం తగ్గితే ఆ ప్రభావం అధికార పార్టీపై పడుతుందని ఆ పార్టీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

కూటమి అభ్యర్థుల ముమ్మర ప్రచారం



ఇచ్ఛాపురం: జెండాలతో టీడీపీ కార్యకర్త

(సోంపేట/అరసవల్లి/పాతపట్నం/పోలాకి/హరిపురం)

టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. శనివారం సోంపేట మండలం బారువలో శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివ రించారు. పోలాకి మండలం ప్రియాగ్రహారం పంచాయ తీలో నరసన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి ఎన్నికల ప్రచారం చేశారు. పాతపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. శ్రీకాకుళం నగ రంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్లోని చేపల బజారులో మత్స్యకారులతో ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ ముఖా ముఖీ కార్యక్రమం నిర్వహించారు. హరిపురంలోని పిడి మందసలో పలాస నియోజకవర్గ కూటమి అభ్యర్థి గౌతు శిరీష ప్రచారం చేపట్టారు.



సోంపేట: బారువలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రామ్మోహన్‌నాయుడు



హరిపురం: పిడిమందసలో గౌతు శిరీషకు తిలకం దిద్దుతున్న మహిళ



అరసవల్లి: మత్స్యకారులతో మాట్లాడుతున్న గొండు శంకర్



పోలాకి: ప్రియాగ్రహారం పంచాయతీలో ప్రచారం నిర్వహిస్తున్న బగ్గు రమణమూర్తి



పాతపట్నం: 'సూపర్ సిక్స్' కార్డు అందిస్తున్న మామిడి గోవిందరావు

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలి: బగ్గు

ప్రియాగ్రహారం(పోలాకి): ఈనెల 13న జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి కోరారు. శనివారం ఆయన ప్రియాగ్రహారం పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ భక్త, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ, తమ్మినాన భూషణ రావు, సంపతిరావు రామన్న, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న కలమట వెంకట రమణ, ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి

'ప్రజాగళం' సభకు స్థలం పరిశీలన

నరసన్నపేట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు నరసన్నపేటలో ఈనెల 9న చేపట్టనున్న ప్రజాగళం సభకు స్థలాన్ని, హెలీప్యాడ్‌ను శని వారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి, అసెంబ్లీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి పరిశీలించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, కళాశాల జంక్షన్ తదిర ప్రదేశాల వద్ద సభ ఏర్పాటుకు, తామరాపల్లి, జమ్ము జంక్షన్ వద్ద గల హెలీప్యాడ్ స్థలాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా కలమట వెంకటరమణ మాట్లాడుతూ చంద్రబాబు ప్రజాగళం యాత్ర విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సైకోను ఇంటికి పంపించండి

సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై ఓటు వేసి సైకో జగన్‌ను ఇంటికి పం పించాలని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి కోరారు. శనివారం ఉర్లాం పంచాయతీ, జగ్గునాయుడుపేట, బొడ్డవానిపేట, మతలబుపేట, చింతువానిపేట, ఉర్లాం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి లేదని, అంతా విధ్వం సమేనన్నారు. కార్యక్రమంలో జనసేన కన్వీనర్ బలగ ప్రవీణ్, టీడీపీ నాయకులు జల్లు చంద్రమౌళి, శిమ్మ చంద్రశేఖర్, అడపా చంద్రశేఖర్, పూతి రమణ, చమళ్ల వామనమూర్తి, బగ్గు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విముక్త రాష్ట్రం లక్ష్యం: ఎంపీ రామ్మోహన్

సోంపేట: వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బారువలో కూటమి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, బీజేపీ నాయకులు బుద్దాన నిర్మలా రెడ్డి, సూరాడ చంద్ర మోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, మద్దు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలకు స్వాగతం పలుకుతున్న నేతలు

రోడ్‌షోలో నీరా'జనం'

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో శనివారం కూటమి అభ్యర్థులు ఎమ్మెల్యే అశోక్, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు భారీ బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణ పరిధిలోని 23 వార్డుల్లోనూ ఈ ర్యాలీ సాగగా అడుగడుగునా ప్రజలు, క్యాడర్ వారికి నీరాజనం పట్టారు. ఓపెన్ టాప్ జీప్‌పై వారిరువురూ ప్రజలకు అభివాదం చేసుకుని ముందుకు సాగారు. పురుషోత్తపురం హైవే నుంచి సుమారు 500 బైకులతో టీడీపీ-జనసేన-బీజేపీ క్యాడర్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏఎస్‌పేట వద్ద కౌన్సిలర్ పత్రి తవిటయ్య, రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీయాదవ్ పూలమాలలు వేసి బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. మహిళలు తిలకం దిద్ది హారతులిచ్చారు. అక్కడి నుంచి పట్టణమంతా బైక్ ర్యాలీ సాగగా రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని రామ్మోహన్, అశోక్ కోరారు. ప్రతీ జంక్షన్ వద్ద వంద లాది మంది ఎదురువచ్చి స్వాగతం పలికారు. జై చంద్రబాబు, జై లోకేష్, జై రామ్మోహన్ నాయుడు, జై అశోక్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. జీపు పైనుంచి వారు అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ అభివాదం చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్ చార్జి దాసరి రాజు, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, మాజీ ఎంపీపీ డి.డిల్లీరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాడి సహదేవ్ రెడ్డి, కౌన్సిలర్లు పత్రి తవిటయ్య, కాళ్ల దిలీప్, ఆశి లీలారాణి, గేదెల శేఖర్, ఉమ్మడి పార్టీల క్యాడర్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే మత్స్యకారుల సంక్షేమం: గొండు శంకర్

అరసవల్లి: మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్ చేపల బజారులో మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించారు. చేపల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బుర్రా సత్తిబాబు ఆధ్వర్యంలో 400 మత్స్యకార కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి శంకర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ స్థాపన నాటి నుంచి మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, 50 ఏళ్లకే మత్స్యకారులకు పెన్షన్ మంజూరు చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మత్స్యకారుల సంక్షేమానికి తూట్లు పొడిచారని, టీడీపీ హయాంలో ఇతర దేశాల్లో చిక్కుకున్న మత్స్యకారులను తమ సొంత గ్రామాలకు చేర్చేందుకు ఎంపీ రామ్మోహన్‌నాయుడు కృషి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీవో 217ను రద్దు చేస్తామని, వేట విరామ సమయంలో రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా తనను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, మత్స్యకార నాయకులు బుర్రా ప్రసాద్, కొమర కమల, మైలపల్లి రాజు, మైలపిల్లి నర్సింహ మూర్తి, కేశవ రాంబాబు, కామేషు, వెంకీ, బీజేపీ నాయకుడు పైడి వేణుగోపాలం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అరసవల్లిలో ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ● శ్రీకాకుళం మండలం ఇప్పిలి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున వారి కుటుంబాలతో సహా టీడీపీలో చేరారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ కండువాలు వేసి ఆహ్వానించారు.



టీడీపీలో చేరిన వారితో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్

కొత్తపట్నంగా తీర్చిదిద్దుతా: గోవిందరావు



టీడీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మామిడి గోవిందరావు

పాతపట్నం: పాతపట్నంను కొత్తపట్నంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎన్డీఏ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. ఏఎస్ కవిటి, చాకిపల్లి, జగ్గిలబొంతు, సన్యాశిరావుపేట, దేవుదళ, కొంచాడపేట, పెద్దమల్లిపురం తదితర గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్య క్షుడు పైల బాబ్జీ, టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ● చాకిపల్లి గ్రామంలో వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి శనివారం ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో సీనియర్ నాయకులు పెద్దింటి జగదీష్, బీశెట్టి దుర్గారావు, మారెడ్డ నాగభూషణ రావు, బత్తుల త్రినాథరావు తదితరులతో పాటు 100 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చు కున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయానికి పాటుపడతామన్నారు.

ఐక్యతతో విజయం సాధిద్దాం

ఐక్యతతో పనిచేసి కూటమి విజయానికి పాటుపడదామని ఎన్డీఏ అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో పాతపట్నం పట్టణ నాయకులతో సమావేశం నిర్వహించారు. తారతమ్యాలు, మనస్పర్థలు వీడి సమష్టిగా పార్టీ విజయానికి శ్రమిద్దామన్నారు. ఎంపీగా రామ్మోహన్ నాయుడును, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, పట్టణాధ్యక్షుడు సైలాడ సతీష్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పలువురు నేతలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై శిరీష ప్రచారం

మందస: మందస పట్టణంలోని పలు వీధుల్లో శనివారం పలాస నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీకే నాయుడు, భావన దుర్యోధన, డొంకూరు తిరుపతి, రాజాన మహేష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లుండలో టీడీపీ ప్రచారానికి హాజరైన జనం

● హరిపురం: పిడిమందస, మధ్య దేవుపురం, నర్సింగపురం, చత్రపురం, కుంబిగాం, జిల్లుండ గ్రామాల్లో ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష శనివారం ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివవరించారు. రానున్న న్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఆమెకు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, డొంకూరు తిరుపతిరావు, కొర్ల కన్నారావు, మజ్జి భాస్కరరావు, కళ్యాణి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే ధ్యేయంగా కృషి చేస్తాం

పలాస: టీడీపీ గెలుపే ధ్యేయంగా కృషి చేస్తామని రాష్ట్ర శ్రీశయన సంఘం సభ్యులు అన్నారు. టీడీపీ కార్యాలయంలో శనివారం శ్రీశయన సంఘం సభ్యుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ గెలుపునకు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో అఖిల భారతగౌడ్ సంఘం కన్వీనర్ కోళ్ల ఈశ్వరరావు, చింతపల్లి కనకారావు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి నాగరాజు, రాష్ట్ర శ్రీశయన సంఘం అధ్యక్షుడు కోల బలరామ్, వంగల మహాలక్ష్మి, రాంబాబు, లొట్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసమే పొత్తు: సినీ హీరో నారా రోహిత్

రణస్థలం: ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసమే టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు అని సినీ హీరో నారా రోహిత్ అన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్డీఏ కూటమి బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు శనివారం చేపట్టిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. అవినీతి, అరాచకాలకు నిలయంగా మారిని రాష్ట్రా న్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంద న్నారు. ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైసీపీ పాలనలో దేవా లయాలకు రక్షణ కరువైందని, వైసీపీ పాలనలో 200 దేవాలయాలపై దాడులు జరిగాయిని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతిస్వామి అన్నారు. సామాన్యుల కోసం నిరంతరం కృషి చేసే వ్యక్తులు కలిశెట్టి అప్పలనాయుడు, నడుకుదిటి ఈశ్వరరావులని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి అభ్యర్థులతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.



ఎన్డీఏ కూటమి అభ్యర్థులతో నారా రోహిత్

జగన్ భయంతో విజయమ్మ అమెరికాకు..: రవికుమార్

సరుబుజ్జిలి: దేశంలో ఏ తల్లికి రాని కష్టం సీఎం జగన్ రెడ్డి తల్లి విజయమ్మకు వచ్చిం దని, ఆయన భయంతోనే ఆమె అమెరికా వెళ్లారని కూటమి అభ్యర్థి కూన రవికుమార్ విమర్శించారు. శనివారం తెలికిపెంట, మతలబుపేట, చిన్న కాగితాపల్లి, విజయరాంపురం, గోనె పాడు, బప్పడాం, సరుబుజ్జిలి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఎన్నికల ముందు సీఎం పదవి కోసం సొంత బాబాయ్‌ని హతమార్చిన వైనాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఎన్నికలకు ముందు తల్లి భయపడి అమెరికా వెళ్లిపోయారన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపిం చాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, ఎన్నికల పార్టీ పరిశీ లకుడు కిమిడి నాగార్జున, నేతలు శివ్వాల సూర్య నారాయణ, పేడాడ సూరపునాయుడు, పైడి మురళీమోహన్ పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక



టెక్కలి: టెక్కలి మేజర్‌పంచాయతీ ఆదీఆంధ్రా వీధికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు శనివారం టీడీపీలో చేరారు. వీరికి నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో యర్ర చిన్నారావు, రాజేష్, దాసరి సోమేసు, మల్లేసు, కాయి శంకర్, ఉర్జాన మాధవ్, దేవాది అశోక్, శివ, వసంత్ తదితరులున్నారు.

మత్స్యకారుల హామీలేమయ్యాయి? పరమేశ్వరరావు

ఆమదాలవలస: జిల్లాలో మత్స్యకారుల ఓట్లతో అధికారంలో వచ్చిన నాయకులు మత్స్యకారుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని శ్రీకాకుళం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు ప్రశ్నించారు. శుక్రవారం ఆమదాలవలస అసెంబ్లీ అభ్యర్థి సనపల అన్నాజీరావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పాదయాత్ర సమయంలో జిల్లాకు వచ్చిన జగన్ మత్స్యకారులకు కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదన్నారు. జిల్లాకు ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా తనను, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపిస్తే జిల్లాలోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమం లో కమ్యూనిస్టు నాయకుడు బవిరి కృష్ణమూర్తి, డి.గోవిందరావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి లఖినేని నారాయణరావు, మాజీ ఎంపీపీ బొడ్డేపల్లి గోవిందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

థర్మల్ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

సోంపేట: 2010 జూలై 14న జరిగిన థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక ఉద్యమంలో స్థానికులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు దుమ్ము దీనబంధు ఎంపీ రామ్మోహన్‌ను కోరారు. ఈ మేరకు బారువలో జరిగిన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. ఈ ఉద్యమంలో 723 మందిపై పోలీసులు కేసులు పెట్టారని, దీంతో యువకులు ఇతర దేశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2019 పాదయాత్ర సందర్భంగా సీఎం జగన్ స్థానికులపై కేసులు ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా నేటికీ నెరవేరలేదన్నారు. దీంతో ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందిస్తూ.. ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉమ్మడి అభ్యర్థులకే రజకుల మద్దతు

ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో ఈనెల 13న జరిగే సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులకే రజకులంతా మద్దతు ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర రజక చైతన్య సేవా సంస్థ ఉపాధ్యక్షుడు బి.సింహాచలం తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ జాతీయ అధ్యక్షుడు విడుదల చేసిన మేనిఫెస్టోలో రజక సామాజిక వర్గ అభ్యు న్నతికి అనేక పథకాలు ప్రకటించారన్నారు. జిల్లాలో పోటీ చేస్తున్న ఉమ్మడి అభ్యర్థు లకు తమ కులస్థులంతా ఓట్లు వేసి వారిని గెలిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో 80 వేల మంది రజకుల ఓట్లు ఉన్నాయన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

రాళ్లపాడు(పోలాకి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13న ప్రతి ఒక్క ఓటరు ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ సత్యనారాయణ కోరారు. రాళ్లపాడు, ముప్పిడి, కాలనీల్లో సదస్సులు నిర్వహించారు. గ్రామాల్లో ఎటువంటి తగాదాలు పడవద్దని, స్వేచ్ఛగా ఓటు వేసుకునేలా సహకరించాలని కోరారు.

బాకీ అడిగినందుకు కత్తితో దాడి

జలుమూరు, మే 4: బాకీ నగదు ఇవ్వాలని అడిగి నందుకు కత్తితో దాడి చేసి ఘటన కొమనాపల్లిలో శనివారం జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొమనాపల్లి గ్రామానికి చెందిన గొల్లంగి నవీన్‌కుమార్, బైరి సింహాచలం మంచి స్నేహితులు. అవసరాల నిమిత్తం నవీన్‌కుమార్ వద్ద రూ.3.50 లక్షలు బైరి సింహాచలం అప్పుగా తీసుకున్నాడు. ఇల్లు కడుతున్నాను, తీసుకున్న అప్పు ఇవ్వాలని నవీన్ మూడు నెలలుగా స్నేహితుడిపై ఒత్తిడి చేశాడు. దీంతో విసుగు చెందిన సింహాచలం శనివారం ఉదయం డబ్బులిస్తాను అచ్యుతాపురం తాగునీటి ప్రాజెక్టు వద్ద రమ్మని నవీన్‌కు ఫోన్ చేశాడు. అక్క డికి వెళ్లగా డబ్బులివ్వలేదు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. సింహాచలం ద్విచక్ర వాహనంలో ఉన్న కత్తిని తీసి నవీన్‌పై దాడి చేసి గాయపరిచాడు. ఈ దాడిలో రెండు చేతి వేళ్లకు, భుజం, తలపైన తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని సింహాచలం ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నవీన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు.

మద్యం అక్రమంగా కలిగిన ఉన్న కేసుల్లో ఆరుగురి అరెస్టు

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో మద్యాన్ని అక్రమంగా కలిగి ఉన్న ఆరుగురిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సుబ్బా రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పోలాకిలో 3.6 లీటర్లు, సంత బొమ్మాళిలో 1.44 లీటర్లు, పలాసలో 1.08 లీటర్లు, నందిగాంలో 1.08 లీటర్లు, పాతపట్నంలో 1.8 లీటర్లు, ఎచ్చెర్లలో 5.4లీటర్ల అక్రమ మద్యాన్ని బెల్టు షాపుల్లో స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం 15 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.10 వేల ఉంటుందని అంచనా వేశామన్నారు. ఈ మద్యాన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసి బెల్టు షాపులకు తరలించినట్లు గుర్తించామన్నారు.

మద్యం తరలిస్తూ వ్యక్తి అరెస్టు

శ్రీకాకుళం క్రైం: మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. గార మండలం లింగాలవలసకి చెందిన వంజుల అప్పల సూరి శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఒక బ్యాగులో 40 మద్యం సీసా లు తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్పీ డి.గంగాధరం ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించగా అప్పలసూరి మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడినట్లు సీఐ ఎంవీ గోపాలకృష్ణ తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

50 మద్యం సీసాలు స్వాధీనం

జలుమూరు: అల్లాడ గ్రామంలో అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తున్న 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ కోటబొమ్మాళి సీఐ హెచ్.గాయత్రి తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో శనివారం సిబ్బందితో దాడిచేసి మద్యం విక్రయిస్తున్న గరుకు రామారావును అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

నర్మదా నది పుష్కరాల్లో మహిళ మృతి

టెక్కలి: మధ్యప్రదేశ్‌లో జరుగుతున్న నర్మదా నది పుష్కరాల్లో టెక్కలికి చెందిన టంకాల మంగ(45) గుండెపోటుతో మృతిచెందింది. శుక్రవారం అక్కడికి చేరుకున్న ఆమె ఆక స్మాత్తుగా గుండెపోటుకు గురైంది. ఆమె భర్త సతీష్ టెక్కలి తహసీల్దార్ కార్యాలయం గేటు పక్కన ఫాస్ట్‌ఫుడ్ షాప్ నిర్వహిస్తున్నారు. ఈమెకు ఇద్దరు పిల్లలు. మృతదేహం ఆదివారం టెక్కలి చేరుకోనుందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య

సంతబొమ్మాళి: బోరుభద్ర గ్రామానికి చెందిన పొందూరు శివ కృష్ణ(32) శనివారం విశాఖ పట్నంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఓ లాడ్జీలో ఉరిపోసుకుని మృతి చెందినట్లు విశాఖ పోలీసులు సమాచారం ఇచ్చారని ఆయ కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్మీలో పనిచేస్తూ సెలవుపై వచ్చిన శివకృష్ణ తిరుగు ప్రయాణంలో ఆత్మహత్య చేసుకున్నటుల సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వసుంధర చెక్‌పోస్ట్ ఆకస్మిక తనిఖీ

మెళియాపుట్టి: వసుంధర పోలీస్ చెక్‌పోస్టుకు రాష్ట్ర ఎన్నికల పోలీస్ పరిశీలకుడు డా.దిగంబర ప్రధాన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ గడువు దగ్గరవుతుండడంతో మరింత అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమం లో ఎస్ఐ టి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయండి

ఇచ్ఛాపురం: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమ త్తంగా ఉండి మద్యాన్ని తరలించకుండా చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ ప్రేమ్‌కాజల్ ఆదేశించారు. శనివారం పురుషోత్తపురం చెక్‌పోస్టును తనిఖీ చేసి వాహనాల రాకపోకలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల చెక్‌పోస్టుల వద్ద 24 గంటలు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్లు, బస్సులు, ఆటోలు, లారీలు, వ్యాన్‌లు తనిఖీ చేయాలన్నారు. అనంతరం టౌన్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను, బెల్లుపడ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సోంపేట: మండలంలోని పాలవలసలో రైలు ఢీకొని పాలవలస గ్రామానికి చెందిన దున్న లక్ష్మీనారాయణ(62)మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పాలవలస గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ పొలం పనులకు రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందారు. మృతుడికి భార్య శేషమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు 2, 4 సెమిస్టర్ల సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసినట్టు డీన్ డాక్టర్ ఎస్.ఉదయ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6, 7 తేదీల్లో ఐసెట్ జరుగు తుండ డంతో ఈ మార్పు చేశామన్నారు. ఈనెల 6, 7 తేదీల్లో జరగాల్సిన రెండో సెమిస్టర్ సప్లిమెం టరీ పరీక్షలు ఈనెల 17, 18 తేదీల్లో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఇదే నెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. ఈ మార్పును విద్యార్థులు గమనించాలన్నారు. రెగ్యులర్ పరీక్షలు యథావిధిగా జరుగుతాయని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న నర్తనశాల పద్యనాటకం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో 295వ నెల సాంస్కృతిక కార్యక్రమం బాపూజీ కళామందిర్‌లో శనివారం సాయంత్రం నిర్వహిం చారు. తిరుపతికి చెందిన సుబ్బరాజు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, దర్శకుడు, నటుడు కోనేటి సుబ్బరాజు ఆధ్వర్యంలో నర్తనశాల పద్య నాటకం ప్రదర్శించారు. 15 మంది నటీ నటులు పద్య నాటకాన్ని రంజింపజేశారు. అలాగే పేద కళాకారులకు పింఛన్లను అందిం చారు. ఈ సందర్భంగా రంగస్థల నటుడు, పద్మశ్రీ ఎడ్ల గోపాలం మాట్లాడుతూ.. తెలుగు భాష ఉన్నం తవరకు పద్య నాటకాలు బతికే ఉంటాయని, పద్య నాటకాల వల్లే కళాకా రులకు మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు చిట్టి వెంకటరావు, పన్నాల నర్సింహమూర్తి, లయన్స్‌క్లబ్ మెంటార్ నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వరుని గ్రామోత్సవంశనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. చైత్ర బహుళ ఏకాదశి సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు అలంక రించి పల్లకిలో వేంచేపు చేసి వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహిం చారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు స్వామిని దర్శించుకుని మంగళ హారతులిచ్చారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, వేంకటాచలం, అప్పారావు, శివ, శ్రీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్ యాక్సిడెంట్స్‌పై మానటరింగ్ కమిటీ ఏర్పాటు

గుజరాతీపేట: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయసదన్‌లో శనివారం మోటార్ యాక్సి డెంట్స్‌పై మానటరింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసి నాయుడు పర్యవేక్షణలో జిల్లా కోర్టు ఆవరణలో సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తులు వాహనదారులను, పాదచారులను వాహనాలతో ఢీకొని వెళ్లిపోతే, చనిపోయిన కుటుంబ సభ్యులు, క్షతగాత్రులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పరిహారం ఇప్పించి న్యాయం చేయడంపై చర్చించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తరుపున బి.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి సన్యాసినాయుడు

బాధిత కుటుంబానికి సాయం అందజేత

శ్రీకాకుళం క్రైం: పోలీసు శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎస్ఐ ఎస్ బెన్నయ్య, హెడ్ కానిస్టేబుల్ కేశవరావు కుటుంబ సభ్యులకు ఏఎస్పీ డా.ప్రేమ్ కాజల్ చెక్కును అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరికి రాష్ట్ర పోలీసు కార్యాలయం నుంచి మంజూరైన కార్పస్ ఫండ్ రూ.లక్ష చొప్పున చెక్కులను అందించారు. ఒక్కో కుటుంబానికి చెక్కులు అందించారు.

యాచకులను అక్కున చేర్చుకున్న ఎస్ఐ

రణస్థలం: మండుటెండలో అనాథలుగా ఉన్న యాచకులను జేఆర్‌పురం ఎస్ఐ కె.గోవిందరావు గుర్తించి వారికి సపర్యలు చేస్తున్నారు. ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాల మేరకు హైవేపై తిరు గుతున్న అనాథలను గుర్తించి వారికి అన్ని విధాలుగా అదుకుంటున్నామని ఎస్ఐ తెలిపారు. ఇందులో భాగంగా శని వారం పలువురు యా చకులకు స్నానాలు చేయించి భోజనం సదుపాయం కల్పిం చారు. అదేవిధంగా వీరిని జిల్లా కేంద్రంలోని ఒక స్వచ్ఛం సంస్థకు తరలించినట్లు ఆయన తెలిపారు.



యాచకునికి స్నానం చేయిస్తున్న ఎస్ఐ

మాక్‌పోలింగ్‌ను పరిశీలించిన జనరల్ అబ్జర్వర్

టెక్కలి: టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం బెల్ సంస్థ నిర్వహించిన మాక్‌పోలింగ్‌ను జనరల్ అబ్జర్వర్ సందీప్ కుమార్, రిటర్నింగ్ అధికారి నూరు ల్ కమర్ పరిశీలించారు. ఈవీఎం మిషన్లు, వీవీ పాట్లు పనిచేస్తున్న తీరు సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఈఆర్‌వో మురళీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

నందిగాం హైవేపై తనిఖీ

నందిగాం: నందిగాం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపట్టా రు. శనివారం సాయంత్రం టెక్కలి రూరల్ సీఐ సూర్యచంద్రమౌళి పర్యవేక్షణలో తనిఖీ చేసి ఎటువంటి పత్రాలు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. తనిఖీలో ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం


అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి శ్రీ సూర్య నారాయణ స్వామివారి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహిం చారు. చైత్ర బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ప్రధాన అర్చ కుడు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో అర్చకులు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ఎస్.చంద్ర శేఖర్, ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అజెండా

జన కేతనం

ఆంధ్రజ్యోతి

ఆదివారం ◇ 5-5-2024



కట్టాలంటే సంకల్పం కావాలి! ప్రణాళిక రూపొందించాలి! ఆచరణలోకి తేవాలి! పట్టుదలతో ముందుకు సాగాలి! అందులోనూ ఒక నగరాన్ని నిర్మించాలంటే... అనితర సాధ్యుడై ముందుకు సాగాలి.

కానీ... కూల్చాలంటే! ఇవేవీ అక్కర్లేదు. విధ్వంసపు ఆలోచన ఒక్కటి చాలు! అంతా నాశనమే!

ఇందులో సంకల్పం నాటి సీఎం చంద్రబాబుదైతే... విధ్వంసం 2019లో గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డిది! కేవలం చంద్రబాబుపై కసితో 'అమరావతి' అనే ఆంధ్రుల కలను ఛిద్రం చేసిన నాయకుడు జగన్! తాను రాష్ట్రానికో ప్యాలెస్ కట్టుకుని... అమరావతిలో ప్రజాధనంతో నిర్మించిన భవనాలను పాడుపెట్టిన విధ్వంసకుడు జగన్! జగన్ అధికారంలోకి వచ్చేదాకా... అమరావతి ఒక అద్భుతం! అది కనీవినీ ఎరుగని నిర్మాణ యజ్ఞం!

ఒక్కసారి అమరావతి వైభవాన్ని గుర్తుకు తెచ్చుకుంటే..

అద్భుత ప్రణాళికతో 'అమరావతి'కి రూపకల్పన.. దేశంలోనే తొలిసారి నవ నగర సృష్టికి శ్రీకారం

రాజధాని కోసం భూసమీకరణ ఓ రికార్డు.. రహదారుల నుంచి భవనాలదాకా వినూత్న ప్రణాళిక

2019 మార్చి దాకా శరవేగంగా సాగిన పనులు.. వేలకొద్దీ కార్మికులతో నిత్యం నిర్మాణ జాతర

90 శాతం వరకు పూర్తయిన కొన్ని ప్రాజెక్టులు.. కళ్లుండీ చూడలేని గుడ్డివాళ్లలా వైసీపీ నేతలు

అమరావతిపై విషం చిమ్మి, విధ్వంసం సృష్టించిన జగన్

పైసా ఖర్చు కాకుండా ప్రణాళిక

అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు. సేకరించిన భూమిలో రైతులకు ప్లాట్లు, ప్రభుత్వ నిర్మాణాలు, రోడ్లు, పార్కులకు పోను మిగిలిన భూమి అమ్మకం ద్వారా వచ్చే సొమ్ముతోనే రాజధానిని నిర్మించే ప్రణాళిక రూపొందించారు. 8,437 ఎకరాల మిగులు భూమి ప్రస్తుతం ప్రభుత్వ స్వాధీనంలో ఉంది. ఎన్నికల ముందు ఇక్కడ మార్కెట్ విలువ గజం రూ.36 వేలకు పెరిగింది. ఆ లెక్కన 8,437 ఎకరాల విలువ రూ.1.48 లక్షల కోట్లు. ఈ డబ్బుతోనే రాజధానిని నిర్మించవచ్చు. సైబరాబాద్ తరహాలో భూముల విలువ పెరుగుతుందని అంచనా. మొత్తం రూ.4.26 లక్షల కోట్లకు పెరిగే అవకాశం ఉంది. ఆ భూమిని దశలవారీగా అమ్ముతూ రాజధాని నిర్మాణానికి చేసిన అప్పులను వడ్డీతో సహా చెల్లించవచ్చు. మిగిలిన డబ్బును 13 ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు.

నాడు రాత్రీ పగలు తేడా లేకుండా ఓ యజ్ఞంలా సాగిన రాజధాని నిర్మాణం.. నేడు అదే ప్రాంతాన్ని ఇలా పాడుబెట్టారు.





అమరావతి

నాడు నేడు

చంద్రబాబు జగన్

నిర్మాణం X నిర్వాకం!

నిర్మాణ యజ్ఞాన్ని బూడిదపాలు చేసిన జగన్

ఆకాశాన్నంటేలా వరుసలో నిల్చున్న భారీ క్రేన్లు! అల్లంత దూరం నుంచే కాంక్రీటు పోసే ఆధునిక యంత్రాలు! విసుగూ విరామం లేకుండా నిరంతరం దుమ్ములేపుతూ మెటీరియల్‌ను చేరవేస్తున్న టిప్పర్లు! ఒకేసారి, ఒకే చోట కొన్ని వేల మంది నిర్మాణ కార్మికులు! 'అమరావతి'లో అప్పుడు సాగింది ఒక మహా నిర్మాణ యజ్ఞం! నవ్యాంధ్రుల రాజధాని కళ్లముందు ఆవిష్కృతమవుతున్న అద్భుతం! అవి ఉత్తుత్తి డిజైన్లు కావు! గ్రాఫిక్ మాయలు కావు! కళ్లముందు పోతపోసినట్లు నిలిచి ఉన్న భారీ నిర్మాణాలు! 2019 మార్చి-ఏప్రిల్ నాటికి రాజధాని ప్రాంతంలో కనిపించిన దృశ్యాలు ఇవి!

ఇప్పుడు అక్కడ పరిస్థితి ఏమిటంటే... ముళ్ల కంపల మధ్య అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు. నాలుగున్నరేళ్లుగా నీళ్లలో నానుతున్న జీఏడీ టవర్ల పునాదులు. తుప్పు పట్టిపోతున్న ఐరన్. సగంలో వదిలేసిన పైపు లైన్లు. ధ్వంసమైన రోడ్లు!

ఒక అద్భుతానికి శ్రీకారం...

రాజధానిలేని రాష్ట్రంగా నవ్యాంధ్ర! రాష్ట్రంలో నవోత్తేజం నింపే ఒక వినూత్నమైన కార్యం చేపట్టాలి! ప్రపంచమే మనవైపు చూడాలి! కేవలం రాజధాని నగరంగా మాత్రమే కాదు... అది రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టాలి. దేవతల రాజధానిని దివి నుంచి భువికి దించాలి! ఈ ఆలోచన నుంచి పుట్టిందే 'అమరావతి'! ఏదైనా కొత్తగా, భారీగా, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆలోచించే చంద్రబాబు నవ్యాంధ్ర తొలి సీఎంగా 'అమరావతి'కి ప్రాణప్రతిష్ఠ చేశారు. భూసమీకరణ నుంచి నిర్మాణం వరకు... ఈ నగర ప్రణాళిక ఒక అద్భుతం!

ల్యాండ్ పూలింగ్ రికార్డు

చంద్రబాబు ప్రభుత్వం రాజధాని కోసం పైసా ఖర్చు లేకుండా 58 రోజుల్లో 33 వేల ఎకరాల భూములను రైతుల నుంచి సమీకరించి రికార్డు సృష్టించింది. 2015 జనవరి 1న భూసమీకరణ పథకానికి సీఆర్‌డీఏ రూపకల్పన చేసింది. 28,538 మంది రైతుల నుంచి 34,395.50 ఎకరాలను సమీకరించింది. అమరావతి ల్యాండ్ పూలింగ్‌ను లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ కేస్ స్టడీగా తీసుకోవడం విశేషం.



నాడు అద్దంలా రోడ్లేస్తే.. నేడు అడ్డగోలుగా తవ్వుకుపోయారు

ఇటుక లేకుండానే...

ఇటుక మీద ఇటుక పెట్టి, గోడలు కట్టి, స్లాబులు వేసి, క్యూరింగ్ చేసి... ఇది సంప్రదాయ పద్ధతి! కానీ నిర్మాణ రంగంలో అప్పుడప్పుడే ప్రాచుర్యంలోకి వచ్చిన 'ప్రికాస్ట్' టెక్నాలజీని అమరావతికి పరిచయం చేశారు. పిల్లర్ల నుంచి స్లాబు వరకు మరోచోట సిద్ధం చేసి... వాటిని తరలించి, అతికించి భవనాన్ని సిద్ధం చేసేస్తారు! సీఆర్డీయే ప్రధాన కార్యాలయాన్ని పూర్తిగా ఈ ప్రికాస్ట్ విధానంలో చేపట్టారు. పిల్లర్లు, మెట్లు, గోడలు, శ్లాబ్, చివరికి బాత్‌రూమ్ గోడలను కూడా ప్రికాస్ట్‌లోనే అమర్చేలా డిజైన్ చేశారు. ఏడంతస్తుల ఈ భవంతిలో సీఆర్డీయేతోపాటు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ), ఏపీరెరా తదితర కార్యాలయాలు కొలువుతీరేలా చేపట్టారు. 60 శాతానికిపైగా పూర్తయిన ఈ నిర్మాణం జగన్ కారణంగా ఆగిపోయింది.

ఇదీ పరిపాలనా నగరి..

ఒక కిలోమీటరు వెడల్పు... 6.6 కిలోమీటర్ల పొడవు! ఇది అమరావతిలోని పాలనా నగరి భౌగోళిక విస్తీర్ణం! ఒకవైపు కృష్ణా నదిని ఆనుకుని ముఖ్యమంత్రి నివాసం, రాజ్‌భవన్‌తో ఈ 'నగరం' మొదలవుతుంది. ఆ తర్వాత వరుసగా... మంత్రులు, ఎమ్మెల్యేలు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది గృహ సముదాయాలు, జడ్జీల బంగళాలు... హైకోర్టు, జ్యుడీషియల్ కాంప్లెక్స్, సచివాలయ టవర్లు నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. మొత్తం అమరావతికి 'పరిపాలనా నగరి' హృదయంలాంటిది. ఇది కేవలం పరిపాలనా, అధికారుల నివాస ప్రాంతంగా మాత్రమే కాకుండా... ప్రజలు, సందర్శకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచేలా డిజైన్ చేశారు. పరిపాలనా నగరిలో ఎక్కడా గజిబిజితనం కనిపించదు. వీధి దీపాల స్తంభాలు మినహా తీగలు కూడా బయటికి కనిపించవు. ఈ ప్రాంతంలో ఉన్న హైటెన్షన్ టవర్లను మరో చోటికి (రీలొకేట్) తరలించారు. 6.6 కిలోమీటర్ల పొడవునా కొత్త లైన్‌వేసి ఎల్ఈడీ విద్యుత్ దీపాలను అమర్చారు.



నాడు



నేడు

నాడు శరవేగంగా పూర్తయిన ఎన్జీవోల క్వార్టర్స్‌కు వెళ్లే దారి సైతం నేడు తుప్పలతో నిండిపోయిన దృశ్యం

గృహ శోభ...

నగరం అంటేనే ట్రాఫిక్ జంఝాటం! ఉరుకులు, పరుగుల జీవితం! కానీ... అమరావతి పరిధిలోని ఉద్యోగులకు ఇలాంటి కష్టాలేవీ లేకుండా ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వ పాలనా నగరి పరిధిలోనే గెజిటెడ్ అధికారులకు, ఎన్జీవోలకు, నాలుగో తరగతి ఉద్యోగులకు క్వార్టర్స్ నిర్మాణం మొదలుపెట్టారు. ఇంటి నుంచి కార్యాలయానికి పది నిమిషాల్లోపు చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఉద్యోగులతోపాటు అఖిల భారత సర్వీసు అధికారులు, వివిధ స్థాయి ఉద్యోగులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల కోసం 61 టవర్లలో ఏకంగా 3840 ఫ్లాట్ల నిర్మాణం చేపట్టారు. అన్నిచోట్లా షియర్ వాల్ టెక్నాలజీని వినియోగించారు. 2019 జనవరి నాటికే 1200కు పైగా ఫ్లాట్ల నిర్మాణం పూర్తయింది. ఇవి కాకుండా... కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శుల కోసం 186 బంగ్లాల నిర్మాణం చేపట్టారు. ఈ మొత్తం వైభవాన్ని జగన్ ధ్వంసం చేశారు.

సమున్నతంగా సచివాలయ టవర్స్..

మొత్తం రాజధాని పరిధిలో సమున్నతంగా నిలిచే భవనాలు... సచివాలయ టవర్లు! మొత్తం ఐదు ఆకాశ హర్మ్యాల పనులను రూ.3,500 కోట్ల వ్యయంతో చేపట్టారు. 2019 జనవరి నాటికే వీటన్నింటి ర్యాఫ్ట్ ఫౌండేషన్ దాదాపు ముగిసింది. దేశంలోనే మొదటిసారిగా... సచివాలయంతోపాటు ఆయా శాఖల ప్రధాన కార్యాలయాలు కూడా ఒకేచోట కొలువుతీరేలా వీటిని రూపొందించారు. ముఖ్యమంత్రి, సీఎస్ ఉండే జీఏడీ టవర్‌ను 50 అంతస్థులతో... ఇతర టవర్లను 40 అంతస్థులతో ప్లాన్ చేశారు. జగన్ విధ్వంస ఆలోచన కారణంగా... ఈ ర్యాఫ్ట్ ఫౌండేషన్లు నీళ్లలో నానుతున్నాయి.

-విజయవాడ/గుంటూరు/మంగళగిరి, ఆంధ్రజ్యోతి



నాడు



నేడు

నాడు సర్వ హంగులతో సిద్ధమైన ఐఏఎస్ క్వార్టర్ల నేటి దుస్థితి ఇది

పేదలకూ చక్కటి గూడు

అమరావతి ప్రజా రాజధాని! ఇక్కడ అన్ని వర్గాల వారికీ చోటు కల్పించారు. రాజధాని పరిధిలో భూమిలేని పేదల కోసం ప్రత్యేకంగా పీఎంఏవై-ఎన్టీఆర్ గృహ సముదాయాలను నిర్మించారు. చక్కటి ప్లానింగ్, ప్రమాణాలతో 'ఎంత బాగున్నాయో' అనిపించేలా... పది గ్రామాల్లో ఐదు వేల గృహాల నిర్మాణం దాదాపుగా పూర్తయింది. చాలాచోట్ల ఇక లబ్ధిదారులకు వాటిని కేటాయించడమే మిగిలింది. వీటన్నింటినీ జగన్ పాడుపెట్టారు. పేదలపైనా పగబట్టారు.

తవ్వకాల తంటా ఉండదు

విద్యుత్తు, నీరు, వంటగ్యాస్, సమాచార వ్యవస్థ ఇలా అన్ని అవసరాలకోసం ప్రత్యేకంగా భూగర్భంలోనే 'డక్ట్'ల నిర్మాణం చేశారు. దీనివల్ల... మళ్లీ మళ్లీ రోడ్లు తవ్వాల్సిన అవసరమే ఉండదు. సీడ్ యాక్సెస్ రోడ్ పొడవునా ఏకంగా ఆరు అడుగుల వెడల్పు, ఆరు అడుగుల ఎత్తుతో డక్ట్‌ల నిర్మాణం చేపట్టారు. అమరావతిలోని అన్ని రహదారుల వెంటా ఇలాంటి డక్ట్‌లు ఉంటాయి. వర్షపు నీటి ప్రవాహానికీ ముందుగానే కాలువలు తవ్వేలా ప్రణాళిక రూపొందించారు. ఇక... మొత్తం రాజధాని తాగునీటి అవసరాలకోసం భూగర్భంలో భారీ పైప్‌లైన్ల నిర్మాణాన్ని చేపట్టారు. జగన్ వచ్చేశాక ఈ డక్ట్‌లన్నీ గోతులుగా మారాయి. పైపులను దొంగలు ఎత్తుకెళుతున్నా దిక్కులేదు.

'సీడ్' యాక్సెస్...

రాజధానిలో రవాణాకు అతి కీలకమైనది, ప్రత్యేకమైనది సీడ్ యాక్సెస్ రోడ్! విజయవాడ-గుంటూరు దారిలో కనకదుర్గ వారధి నుంచి దొండపాడు వరకు... 21.2 కిలోమీటర్ల దారి 2019 జనవరి నాటికే పూర్తయింది. జగన్ పార్టీ కుయుక్తులు, కుట్రల కారణంగా... భూసమీకరణ సమస్య ఏర్పడి 3 కిలోమీటర్ల దారి మాత్రం పూర్తి కాలేదు. ఈ రోడ్డు వెడల్పు 200 అడుగులు! అలాగే... రాజధాని నగరంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా సులువుగా, వేగంగా చేరుకునేలా మొత్తం 320 కి.మీ. ప్రాధాన్య రహదారుల నిర్మాణం చేపట్టారు.



నాడు



నేడు

నాడు వేల కార్మికులతో శ్రామిక జీవన కళ.. పక్కన పడేసిన హెల్మెట్ల పోగే నేటి శిథిల వాస్తవం

కొలువు దీరిన కార్మిక శక్తి...

అమరావతి నిర్మాణంలో 20కిపైగా కాంట్రాక్టు సంస్థలు ఏకకాలంలో భాగస్వాములయ్యాయి. అప్పట్లో.. నిత్యం 15 వేల నుంచి 20 వేల మంది కార్మికులు పనిచేసేవారు. వీరందరి కోసం నిర్మాణ స్థలాల్లోనే నివాసాలు ఏర్పాటు చేశారు. అక్కడంతా ఒక జాతరలా ఉండేది. జగన్ రాగానే ఇదంతా ఒక్కసారిగా మాయమైపోయింది.

నిర్మాణం పూర్తైతే.. రేపటి సంచికలో

అబ్బ ఛా!



గుడివాడ అమర్‌నాథ్, మంత్రి

స్టీల్ ప్లాంటు కోసం పదవిని వదిలేస్తా!

విశాఖపట్నం స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించబోమని అనకాపల్లి పర్యటనలో ప్రధాని నరేంద్రమోదీ ప్రకటిస్తే 'ఈ పదవిని' త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నా. అవసరమైతే గాజువాక సీటు కూడా వదిలేస్తా. నా తాత ఎమ్మెల్యే, నా తండ్రి మంత్రిగా చేశారు. నేను కూడా చిన్న వయసులోనే మంత్రినయ్యా. ఇంకా నాకు బోలెడు వయస్సుంది. పదవులు లేకపోయినా ఫరవాలేదు.

వైసీపీ నేతలకు పండగ

పథకం.. పేదలకు! ఆ పేరుతో కాసుల పండగ మాత్రం అధికార వైసీపీ నేతలకు! జగనన్న ఇళ్ల కాలనీలకు భూసేకరణ పేరిట వేల కోట్లు దోచేశారు. స్థానిక నేతలు.. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై భారీ అవినీతికి పాల్పడ్డారు.

కోట్లు కుమ్మేశారు

పేదల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 25,360 ఎకరాల భూములు కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.55 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు ప్రభుత్వమే చెబుతోంది. వైసీపీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి.. వాటిని తిరిగి నాలుగైదు రెట్లు ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మేశారు. దళితులు, గిరిజనులను కూడా బెదిరించి వారి భూములను తక్కువ ధరకు కొట్టేశారు.

లెవెలింగ్‌లోనూ కుమ్ముడు

భూములను మెరక చేసి (లెవెలింగ్) జగనన్న కాలనీలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.33 వేల కోట్లు ఖర్చు చేసింది. ఇందులోనూ సగానికిపైగా సొమ్మును అధికార పార్టీ నేతలు జేబులో వేసుకున్నారు. మట్టి తరలింపు పేరుతో వేల కోట్లు దోచుకున్నారు. ఇక ఇళ్ల నిర్మాణంలోనూ కాంట్రాక్టర్లు సొమ్ములు నొక్కేశారు.

ఊళ్లకు దూరంగా స్థలాలు..!

చాలాచోట్ల ఊరికి దూరంగా, శ్మశానాలకు దగ్గరగా, లోతట్టు ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. నివాస యోగ్యం కానీ చోట ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆవ భూములు, బంక భూములు కూడా కొనుగోలు చేసి పేదలకు అంటగట్టారు. చిన్నపాటి వర్షాలకే జగనన్న లే అవుట్లు చెరువులుగా మారాయి.

గుసగుసలు

ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీకి జై!



నెల్లూరు జిల్లాలో ఒక వైసీపీ అభ్యర్థి వింత ప్రచారం చేస్తున్నారు. "ఇప్పుడు ఒక పార్టీ నుంచి పోటీ చేస్తున్నా! అదే పార్టీలోనే ఉంటానని అనుకోవద్దు. ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీలో చేరిపోతా. నాకు పార్టీలు ముఖ్యం కాదు. నియోజకవర్గ అభివృద్ధి.. ప్రజల సమస్యలు ముఖ్యం. అధికార పార్టీలో ఉంటే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయి. అందుకే... మా పార్టీ గెలిస్తే మా పార్టీలో ఉంటా. ప్రతిపక్షం గెలిస్తే ప్రతిపక్షంలో చేరిపోతా!" అని ఆయన ఓటర్లకు చెబుతున్నారు. ఇది తెలిసిన ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి అప్రమత్తమయ్యారు. "నన్నే గెలిపించండి. మా పార్టీనే అధికారంలోకి వస్తుంది. పార్టీ మారతానని చెప్పే వారి మాటలు నమ్మొద్దు" అని కోరుతున్నారు.

జగనన్న ఇళ్ల కాలనీల్లో వేల కోట్లు దోపిడీ



పేదల ఇళ్ల స్థలాల కోసం భూముల కొనుగోలు వ్యవహారంలో వైసీపీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు అడ్డగోలుగా వ్యవహరించారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలే రంగంలోకి దిగారు. మరికొన్నిచోట్ల బంధువులు, బినామీలను ముందు పెట్టి వ్యవహారం నడిపించారు. మొదట జనావాసాలకు దూరంగా, నివాసం ఉండటానికి ఏమాత్రం సౌకర్యం లేనిచోట తక్కువ ధరకు భూములు కొనుగోలు చేశారు. ఆ తర్వాత ఆ భూములనే జగనన్న కాలనీల కోసం కొనుక్కునేలా అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వానికి భారీ ధరకు అంటకట్టారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల అధికార పార్టీ నేతలు కోట్లు వెనకేసుకున్నారు. జగనన్న కాలనీల లెవెలింగ్ పనుల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు.

- పేదల పేరుతో వైసీపీ పెద్దలకు పండగ
- స్థలాల కొనుగోలులో కోట్లు కొల్లగొట్టేశారు
- పనికిరాని భూములను చౌక ధరకు కొని ప్రభుత్వానికి 4-5 రెట్లకు అమ్మేశారు
- స్థలాల సేకరణకే 55 వేల కోట్లు ఖర్చు
- లే అవుట్ల లెవెలింగ్‌కు 33 వేల కోట్లు
- ఇందులోనూ కోట్లు కుమ్ముడు
- ఇళ్ల నిర్మాణంలోనూ అవినీతి

స్కీం వెనుక స్కాం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'ఇళ్లు లేని పేదలందరికీ స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తాం. ఐదేళ్లలో 25 లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తాం. ఒక్కో లబ్ధిదారుడికి 2 నుంచి 5 లక్షల విలువైన ఇంటిని ఆస్తిగా అందజేస్తాం' అని గత ఎన్నికల ముందు వైసీపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. ఈ ఐదేళ్లలో 5 లక్షల ఇళ్లు మాత్రమే కట్టారు. మిగిలినవి ఎప్పటికి పూర్తవుతాయో కానీ ఈ పథకం వైసీపీ నేతలకు కల్పవృక్షంలా మారింది. పేదలకు ఇళ్ల స్థలాల సేకరణకు అధికార పార్టీ నేతలు చౌక ధరకు భూములు కొని, ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మి భారీగా సొమ్ము చేసుకున్నారు. ఆ తర్వాత జగనన్న కాలనీల లెవెలింగ్ పేరుతోనూ వేల కోట్లు దండుకున్నారు. భూముల కొనుగోలు, లెవలింగ్ పనులకు ప్రభుత్వం దాదాపు 83 వేల కోట్లు ఖర్చు చేసింది. ఈ పథకం వల్ల పేదలకు కలిగిన ప్రయోజనం అంతంతే. వైసీపీ నేతలు మాత్రం కోట్లు కొల్లగొట్టారు. నివాస యోగ్యం కానీ చోట స్థలాలు ఇవ్వడంతో చాలాచోట్ల పేదలు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష మంది లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్ల పట్టాలను ప్రభుత్వానికే తిరిగి ఇచ్చేశారు. 15 వేలకు పైగా జగనన్న కాలనీలను ఏర్పాటు చేశామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా.. చాలా చోట్ల మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదు.

అస్మదీయులకే కాంట్రాక్టులు

ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టుల్లోనూ అధికార పార్టీ నేతలు దోచుకున్నారు. ఆప్షన్-3 ఇళ్లను ప్రభుత్వం నిర్మించకుండా అస్మదీయ కాంట్రాక్టర్లకు కట్టబెట్టారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి బంధువులు, అనుచరులు డైరెక్టర్లుగా ఉన్న రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 52,262 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును అప్పగించారు. జేఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు 78,065 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును ఇచ్చారు. దాదాపు 1500 కోట్ల విలువైన పనులను ఈ ఒక్క సంస్థకే కట్టబెట్టారు. దీనివెనుక రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో పని చేసిన ఒక అఖిల భారత సర్వీస్ అధికారి చక్రం తిప్పినట్లు సమాచారం. ఇక అజాయా వెంచర్స్‌కు 23,571 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును కట్టబెట్టారు. రాష్ట్రంలో ఆప్షన్-3 కింద నిర్మించాల్సిన ఇళ్లలో సగానికిపైగా కాంట్రాక్టులను ఈ మూడు సంస్థలకే ఇవ్వడం వెనుక లోపాయికారీ ఒప్పందాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మూడు సంస్థలతోపాటు జిల్లాలవారీగా కావాల్సిన వారికి కాంట్రాక్టులు ఇచ్చారు. గృహ నిర్మాణ శాఖలో పని చేస్తున్న కొంతమంది అధికారులు కూడా తమ సమీప బంధువులను కాంట్రాక్టర్లుగా రంగంలోకి దింపినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టకుండానే అడ్వాన్సుల రూపంలో రూ.కోట్ల ప్రజాధనాన్ని దోచేశారు. ఒక్కో ఇంటి పునాదికి రూ.70 వేలు చొప్పున మొత్తం 3.50 లక్షల ఇళ్లకు అడ్వాన్సులు ఇచ్చారు. ఒక్కో ఇంటికి 342 కేజీల స్టీలు, 40 బస్తాల సిమెంట్ చొప్పున లక్షలాది టన్నుల స్టీలు, సిమెంటుతోపాటు ఉచితంగా ఇసుకను కూడా కాంట్రాక్టర్లకు సరఫరా చేశారు. దీనికి ప్రతిఫలంగా అధికారులు కమీషన్లు దండుకున్నారు. అడ్వాన్స్‌లు తీసుకున్న కాంట్రాక్టర్లు నామ్ కే వాస్తేగా పనులు చేపట్టారు. సిమెంటు, స్టీలు అమ్మేసుకుని కోట్లు కొల్లగొట్టారు.



ఆవలో నీట మునిగిన ఇళ్ల స్థలాలు

ఆవ భూముల్లో కోట్లు దోపిడీ

తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడిలో ఎకరా రూ.30 లక్షలు కూడా చేయని ఆవ భూములను రూ.45 నుంచి రూ.60 లక్షల ధరకు సుమారు 600 ఎకరాలు కొనుగోలు చేశారు. వైసీపీ నేతలు కోట్లాది రూపాయలు దోచుకున్నారు. స్థానిక నేతలు రాష్ట్రస్థాయి నేతలతో కుమ్మక్కై ఈ వ్యవహారం నడిపారు. అప్పట్లో ఇది సంచలనమైంది. రాజమండ్రి అర్బన్ పేదల కోసం రాజానగరం మండలం కానవరంలో 100 ఎకరాలు సేకరించారు. ఎకరం రూ.66 లక్షలకు కొనుగోలు చేశారు. అందులో 60 లక్షలు భూమి యజమానికి ఇచ్చి, వైసీపీ, రెవెన్యూ అధికారులు రూ.6 లక్షలు తీసుకునేలా ఒప్పందం చేసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఇక్కడ లేఅవుట్లు కూడా వేయలేదు. ఇంకా పొలాలుగానే ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందు సుమారు 10 వేలమందికి పట్టాలు పంచేశారు. వారికి స్థలాలు మాత్రం చూపించలేదు.

అధికారులు, నేతలు కుమ్మక్కై..

ఉమ్మడి కృష్ణా జిల్లాలో జగనన్న కాలనీలకు ఇళ్ల స్థలాల సేకరణలో అప్పటి రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలు కలసి కోట్లాది రూపాయలు దోచుకున్నారు. జక్కులనెక్కలం గ్రామంలో గతంలో దళిత వర్గాలకు అసైన్డ్ పట్టాలుగా ఇచ్చిన 7 ఎకరాలను రూ.20 లక్షల చొప్పున బినామీ వ్యక్తుల పేరుతో కొనుగోలు చేసి.. రూ.65 లక్షల చొప్పున ప్రభుత్వానికి విక్రయించారు. రెవెన్యూ అధికారులే దళారుల అవతారం ఎత్తి బినామీ పేర్లతో వ్యవహారం నడిపించారు. వైసీపీ నేతలతో కలసి లక్షల రూపాయలు ఆర్జించారు. అలాగే బల్లిపర్రు గ్రామంలో రైతులను బెదిరించి 3 ఎకరాల అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకున్నారు. గన్నవరం విమానాశ్రయానికి కూతవేటు దూరంలోని కేసరపల్లిలో ఎందుకూ పనికిరాని ముంపు ప్రాంతానికి చెందిన భూములను ఎకరం రూ.75 లక్షల చొప్పున కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో భారీఎత్తున అవినీతి జరిగిందని అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదులు వచ్చాయి.



నున్న లే అవుట్

రాక్రీట్ సంస్థపై కేసు

విజయవాడలోని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన నున్న మోడల్ లే అవుట్‌లో ప్రభుత్వం తరఫున 600 ఇళ్లు కట్టించేందుకు వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి బంధువులకు చెందిన రాక్రీట్ సంస్థ పనులను దక్కించుకుంది. కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై కింద అందించే రూ.1.80 లక్షలు కాకుండా అదనంగా లబ్ధిదారుడు రూ.35 వేలు చెల్లించే పద్ధతిలో ఒప్పందం కుదిరింది. లబ్ధిదారుడి తరఫున జిల్లా యంత్రాంగం బ్యాంకు ద్వారా రుణాలిప్పించింది. ఈ రుణాన్ని నేరుగా కాంట్రాక్టు సంస్థ తీసుకునే అవకాశాన్ని కల్పించింది. ఆ డబ్బులను తీసేసుకున్న కాంట్రాక్టు సంస్థ కేవలం బేస్‌మెంట్ పనులు చేసి వెళ్లిపోయింది. తీసుకున్న అప్పులకు లబ్ధిదారులు వడ్డీలు కట్టాల్సి వస్తోంది. రాక్రీట్ సంస్థ మోసాలపై ఆటోనగర్ పోలీసు స్టేషన్‌లో లబ్ధిదారులు కేసు పెట్టారు. ఈ కేసుపై ఎలాంటి పురోగతి లేదు.



లక్ష్మీపురం లే అవుట్



బొల్లవరం లే అవుట్

గిరిజన భూముల్ని చౌకగా కొని..



విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని రామన్న దొరవలస సమీపంలో గిరిజనులకు చెందిన 20ఎకరాల అసైన్డ్ భూములను ఓ వైసీపీ నాయకుడు ముందుగానే అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. తరువాత ఆ భూములను జగనన్న కాలనీ కోసం ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మేశారు. ఆయన లక్షలాది రూపాయలు వెనకేసుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు లోకాయుక్తలో కేసు వేశారు. ప్రస్తుతం కేసు నడుస్తోంది.

మెరక పనుల్లోనూ మేత

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష్మీపురం, పోణంగి, పాలగూడెం ప్రాంతాల్లో భూముల కొనుగోలులో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. లక్ష్మీపురంలో మార్కెట్ రేటు కన్నా ఎక్కువ ధరకు భూములు కొనుగోలు చేశారని అప్పట్లో ప్రతిపక్ష నాయకులు ఆందోళనలు చేశారు. లక్ష్మీపురం, పోణంగిలో మెరక పనులకు సంబంధించి కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అధికారులు అవినీతికి పాల్పడ్డారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నివాసయోగ్యం కాకున్నా...

కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం గ్రామాల్లో రూ.167 కోట్లు వెచ్చించి రైతుల నుంచి 478.67 ఎకరాలను కొన్నారు. మీనాపురంలో తప్ప రామేశ్వరం, బొల్లవరం గ్రామాలలో సేకరించిన భూములు నివాసయోగ్యమైనవి కావు. వైసీపీ నేతలు బినామీల పేరిట భూములు కొనుగోలుచేసి ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇందులో చాలావరకు చుక్కల భూములు, నల్లరేగడి బంక భూములు ఉన్నాయి. భూసేకరణ వ్యవహారంలో అధికార పార్టీ నేతలు కోట్లు దోచుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

సంఘం చెప్పిన మాట



కేఆర్‌కే రాజు, కో కన్వీనరు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ సాధన సమితి

కూటమి మేనిఫెస్టోలో క్షత్రియులకు ప్రాధాన్యం

జగన్ క్షత్రియులను నయవంచన చేశారు. ఐదేళ్లలో క్షత్రియులకు ఆయన చేసింది ఏమీ లేదు. క్షత్రియులు ఎదుర్కొంటున్న సమస్యలు, క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు, భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం తదితర అంశాలపై టీడీపీ అధినేత చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చాం. ఆయన చాలా సానుకూలంగా స్పందించారు. మేనిఫెస్టోలో కూడా చేర్చారు. దీంతో క్షత్రియ కార్పొరేషన్ సాధన సమితి కూటమికి పూర్తి మద్దతు ఇస్తోంది. ఈమేరకు క్షత్రియులను చైతన్యవంతం చేస్తున్నాం.

- విజయనగరం

ఓటు వేయడం అనేది మనపట్ల, ఇతరులపట్ల, ఈ దేశంపట్ల, ఈ ప్రపంచంపట్ల మనకున్న నిబద్ధతకు నిదర్శనం



- షారోన్ షాజీబెర్గ్ (అమెరికన్ రచయిత)

గుడివాడలో హోరాహోరీ





మాజీ మంత్రి కొడాలి నానితో వెనిగండ్ల రాము ఢీ

వరుసగా ఐదోసారి గెలుపుపై నాని కన్ను.. తొలి గెలుపు కోసం పక్కా వ్యూహంతో రాము

కీలకం

రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్న నియోజకవర్గాల్లో కృష్ణా జిల్లాలోని గుడివాడ ఒకటి. ప్రధాన పార్టీ అభ్యర్థులిద్దరూ ఆర్థిక, అంగబలాల్లో సమాన స్థాయిలో ఉండడంతో గుడివాడ పోరు ఆసక్తి రేపుతోంది. వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు అలియాస్ నాని, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా ఎన్నారై వెనిగండ్ల రాము పోటీ చేస్తున్నారు. ఇక్కడి నుంచి వరుసగా నాలుగు సార్లు విజయం సాధించిన నానీ ఐదోసారి కూడా గెలవాలని తహతహలాడుతున్నారు. అయితే అదంత సునాయాసంగా కనిపించడం లేదని సొంత పార్టీ శ్రేణులే అంటున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌పై బూతుల దాడిలో ముందుండే నానీ ఓటమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు కసితో పనిచేస్తున్నాయి.

ఒకనాడు టీడీపీ కంచుకోట

గుడివాడ.. టీడీపీ ఆవిర్భావం నుంచీ ఆ పార్టీకి కంచుకోట. టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు పుట్టిన నిమ్మకూరు ఒకప్పుడు గుడివాడ నియోజకవర్గంలోనే ఉండేది (2009లో పామర్రులోకి వెళ్లింది). సొంత గడ్డపై మమకారంతో 1983లో ఎన్టీఆర్ తన రాజకీయ అరంగేట్రానికి ఈ నియోజకవర్గాన్నే కార్యశాలగా ఎంచుకున్నారు. గుడివాడ వాసులూ అంతే మమకారంతో ఆయన్ను గెలిపించారు. 1985లోనూ విజయం సాధించారు. ఆయన హయాంలో గుడివాడ రూపురేఖలు మారిపోయాయి. అభివృద్ధి పరుగులు తీసింది. అందమైన రహదారులతోపాటు క్రీడాప్రియుల కోసం ఎన్టీఆర్ స్టేడియం నిర్మించారు. టీడీపీ పుట్టిన తర్వాత ఇప్పటి వరకు 10 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే 7 సార్లు టీడీపీ జెండా ఎగిరింది. ఒక్కసారి కాంగ్రెస్, గత రెండుసార్లు వైసీపీ గెలుపొందింది. కొడాలి నానీ వరుసగా నాలుగు సార్లు (2004, 2009ల్లో టీడీపీ తరఫున, 2014,19ల్లో వైసీపీ తరఫున) విజయం సాధించారు. వరుస ఓటముల నుంచి పాఠాలు నేర్చుకున్న టీడీపీ.. ఎన్నారై వెనిగండ్ల రామును ఎన్నికలకు రెండేళ్ల ముందే రంగంలోకి దింపింది. గత రెండేళ్లుగా నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలతో ఆయన చొచ్చుకుపోయారు. మాజీ ఎమ్మెల్యే, స్థానికంగా బలమైన నాయకుడిగా ఉన్న రావి వెంకటేశ్వరరావు తొలుత ఆయనకు దూరంగా ఉన్నా అధిష్ఠానం జోక్యంతో ప్రస్తుతం ఇద్దరూ కలిసి పనిచేస్తున్నారు. రాము సతీమణి ఎస్సీ సామాజికవర్గానికి చెందిన మహిళ కావడం కలిసొచ్చే అంశమని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

విధ్వంసం, కేసినోలు.. సెంటిమెంట్..

నానీ సైతం దీటైన వ్యూహాలతో ఐదోసారి గెలుపు కోసం కసరత్తు చేస్తున్నారు. తనపై నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని గ్రహించి.. ఆఖరి అస్త్రంగా సెంటిమెంట్‌ను తెరపైకి తెచ్చారు. ఇవే తనకు చివరి ఎన్నికలని.. గెలిపించి గౌరవప్రదంగా రాజకీయాల నుంచి నిష్క్రమించే అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. అయితే ఒకప్పుడు అభివృద్ధికి మారుపేరుగా ఉన్న గుడివాడలో గత ఐదేళ్లలో విధ్వంసం రాజ్యమేలింది. తాగునీటికీ ప్రజలు అల్లాడుతున్నారు. సాగునీటిదీ అదే పరిస్థితి. వీటికితోడు నాని గుడివాడను జూదశాలగా మార్చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా కేసినో సంస్కృతిని తొలిసారి దిగుమతి చేసుకున్న పట్టణంగా గుడివాడ నిలిచిపోయింది. నానీ మూడేళ్లు రాష్ట్ర మంత్రిగా చేశారు. నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టడం కన్నా ప్రతిపక్ష నాయకులపై బూతులతో విరుచుకుపడడానికే ప్రాధాన్యమిస్తూ వస్తున్నారు. ఇసుక రీచ్‌ల్లో ఇసుక దోపిడీతో కోట్లు కొల్లగొడుతున్నారని విపక్షాలు దుయ్యబడుతున్నాయి. రోడ్ల బాగునూ నానీ పట్టించుకోలేదు. టిడ్కో ఇళ్లను ఐదేళ్లపాటు లబ్ధిదారులకు ఇవ్వకుండా ఎన్నికల ముందు సీఎం జగన్‌తో ప్రారంభింపజేసి హడావుడి చేశారు. ఈ పరిణామాల దరిమిలా ఆయన చెమటోడ్చాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి



వెనిగండ్ల రాము బలాలు..

ఉన్నత విద్యావంతుడు.. ఆర్థిక, అంగ బలం పరంగా బలమైన నాయకుడు. స్థానిక టీడీపీ నేతలతో మమేకం..

బలహీనతలు: తొలిసారి పోటీ టీడీపీలో ఉన్న నానీ కోవర్టులు ఎన్నికల నిర్వహణ కొత్త

కొడాలి నాని బలాలు..

20 ఏళ్లుగా ఎమ్మెల్యే.. ఆర్థిక, అంగబలాలు.. ఎన్నికల నిర్వహణలో ఆరితేరడం.. ఎస్సీ ఓటు బ్యాంకు.

బలహీనతలు

గత ఐదేళ్లలో అభివృద్ధిలేమి, కేసినో సంస్కృతిపై ఆగ్రహ జ్వాలలు.. ఎన్నికలప్పుడు తప్ప అందుబాటులో ఉండకపోవడం.



గుడివాడ నియోజకవర్గ స్వరూపం..

మండలాలు: గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ

మొత్తం ఓటర్లు:	2,04,271
పురుషులు:	97,710
మహిళలు:	1,06,550
ట్రాన్స్‌జెండర్లు:	11

కీలక సామాజిక వర్గాలు

ఎస్సీలు-60 వేలు, బీసీలు-40 వేలు, కాపులు-30 వేలు, ముస్లింలు-30 వేలు, కమ్మ-12 వేలు, రెడ్లు-8 వేలు, బ్రాహ్మణ/వైశ్య/మార్వాడీలు- 25 వేలు